



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ వాయిదా 4

ప్రధాన దేవాలయాలకు చైర్మన్ల నియామకం 4




# వన్ నేషన్.. వన్ విజన్

ఎన్డీయే ప్రభుత్వ నినాదమిది..



- ప్రతి ఒక్కరికీ జీఎస్టీ-2.0 సంస్కరణల ఫలాలు
- విస్తృత ప్రచారానికి కేబినెట్ సబ్ కమిటీ వేస్తాం
- జీఎస్టీ సంస్కరణలతో ఏపీ పథకాలకు లబ్ధి
- కొన్ని రాజకీయ పార్టీలకు సంస్కరణలు అర్థం కావు
- ప్రగతి సంస్కరణలకు ఆ పార్టీలు సహకరించవు
- తొలిరోజు సభలో జీఎస్టీ సంస్కరణలపై సీఎం చంద్రబాబు
- జీఎస్టీ-2.0 సంస్కరణలను స్వాగతిస్తూ తీర్మానించిన తొలి రాష్ట్రంగా ఏపీ
- సంస్కరణలతో దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారు..
- నరేంద్ర మోదీ, నిర్మలా సీతారామన్‌కు శాసనసభ అభినందనలు

2

## జీఎస్టీ సంస్కరణలకు హృదయపూర్వక ఆమోదం

- ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు 3

## నెల్లూరు రోడ్డు ప్రమాద బాధితులకు రూ.5లక్షల చొప్పున పరిహారం

ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు 3

## 8రోజులపాటు అసెంబ్లీ

- 27 అంశాలపై చర్చకు నిర్ణయం
- స్పీకర్ అధ్యక్షతన బీఏసీలో నిర్ణయం
- జీరో అవర్‌లోనూ మంత్రులుండాలన్న సీఎం

3

## అసెంబ్లీ వేళ.. అన్నకు నివాళులు

అమరావతి (చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ యూరియాతో సహా అన్ని సమస్యలపై సభలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కుంటి సాకులతో వైసీపీ సభ్యులు అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే దాన్ని సాకుగా చూపి అసెంబ్లీకి రాకపోవడమేమిటని తప్పుబట్టారు.





## జీఎస్టీ సంస్కరణలు చారిత్రాత్మకం

- ప్రధాని మోదీని అభినందిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానంపై మంత్రి లోకేష్ హర్షం 4

## యూరియాపై చర్చకు సిద్ధం

- మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు 3

## అర్హుల పింఛన్లు ఎక్కడా తొలగించలేదు

- మండలిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 3

## టిడ్కో ఇళ్లు పూర్తిచేస్తాం

- రూ.4500 కోట్ల రుణానికి హడ్కో అంగీకారం
- ఇళ్ల సంఖ్యను భారీగా తగ్గించిన ప్రభుత్వం వాటినీ పూర్తి చేయలేదు
- ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం
- అసెంబ్లీలో మంత్రి నారాయణ

3

## ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యం

- రూ.2,400 కోట్లు ఖర్చు అంచనా
- రెండేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళిక
- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు

4

కరేడులో రైతులు

## స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు

- ఇప్పటికే రైతులు 500 ఎకరాలు ఇచ్చారు
- ఎకరాకు రూ.20 లక్షల వరకు నష్టపరిహారం
- భూసేకరణ బాధితులకు ఉపాధి కల్పిస్తాం
- శాసనమండలిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్


5

చైతన్యరథం

# వన్ నేషన్.. వన్ విజన్

## ఎన్డీయే ప్రభుత్వ నినాదమిది..

- ప్రతి ఒక్కరికీ జీఎస్టీ-2.0 సంస్కరణల ఫలాలు
- విస్తృత ప్రచారానికి కేబినెట్ సబ్ కమిటీ వేస్తాం
- జీఎస్టీ సంస్కరణలతో ఏపీ పథకాలకు లబ్ధి
- కొన్ని రాజకీయ పార్టీలకు సంస్కరణలు అర్థం కావు
- ప్రగతి సంస్కరణకు ఆ పార్టీలు సహకరించవు
- తొలిరోజు సభలో జీఎస్టీ సంస్కరణలపై సీఎం చంద్రబాబు
- జీఎస్టీ-2.0 సంస్కరణలను స్వాగతిస్తూ తీర్మానించిన తొలి రాష్ట్రంగా ఏపీ
- సంస్కరణలతో దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారు..
- నరేంద్ర మోదీ, నిర్మలా సీతారామన్‌కు శాసనసభ అభినందనలు




అమరావతి (చైతన్య రథం): ప్రపంచంలో దేశం నెంబర్-1 కావాలి. దేశంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉండాలి. దీనికి తాజాగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ-2.0 సంస్కరణలు ఊతమిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాల తొలిరోజు సభలో జీఎస్టీ సంస్కరణలపై చర్చ జరిగింది. కేంద్రం చేపట్టిన సరళీకృత సంస్కరణ నేపథ్యంలో ఏయే వస్తువులకు ఎంతమేర ధరలు తగ్గుతాయనే అంశాన్ని ముఖ్యమంత్రి సభలో వివరించారు. జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈమేరకు జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అభినందిస్తూ ఏపీ శాసన సభలో ముఖ్యమంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దేశంలోనే తొలిసారి జీఎస్టీ-2.0 సంస్కరణలను స్వాగతిస్తూ తీర్మానం చేసిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "గతంలో సీఎస్టీ, వ్యాట్‌లాంటి సంక్లిష్టమైన పన్నుల వ్యవస్థ ఉండేది. 17 రకాల పన్నులు, 13 రకాల సెస్సులు, సర్చార్జిలు ఉండేవి. డబ్బు కావాలంటే సర్‌ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వాలు విధించేవి. ఒక ఉత్పత్తికి అనుబంధ ఉత్పత్తులు వచ్చినా పన్నులు వేసే పరిస్థితి ఉండేది. అలాంటి వాటికి చెక్‌పెడుతూ జీఎస్టీని 2017లో ఎన్డీఏ ప్రభుత్వం తెచ్చింది. వాజ్‌పేయి హయాంలోనే జీఎస్టీ తీసుకురావాలని ప్రయత్నించినా కుదరలేదు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ మోదీ తొలిసారి ప్రధాని కాగానే జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు 140 కోట్లమంది ప్రజలకు ప్రయోజనం కలిగేలా జీఎస్టీ విధానాన్ని మరింత సరళతరం చేస్తూ రెండు స్లాబులతోనే కేంద్రం సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రభుత్వానికి ఆదాయం వస్తే అభివృద్ధి సంక్షేమం జరుగుతుంది. రెండోతరం జీఎస్టీ అమలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలక మలుపు కాబోతోంది. సంపద సృష్టించ లేనివారికి సంక్షేమం గురించి మాట్లాడే అధికారం లేదు. కేంద్రం తీసుకువచ్చిన ఈ సంస్కరణలతో ముందుగానే దీపావళి, దసరా పండుగల బోనస్ ఇచ్చారు. 99 శాతంమేర వస్తువులన్నీ 5 శాతం పన్ను పరిధిలోకే వచ్చాయి. పేద-మధ్యతరగతి సహా అందరికీ లబ్ధి కలుగుతుంది" అని చంద్రబాబు వివరించారు.

### వన్ నేషన్- వన్ ట్యాక్స్ విధానంతో ఎంతో అభివృద్ధి

"వన్‌నేషన్ -వన్ ట్యాక్స్ విధానం సక్రమంగా అమలు కావటంవల్ల ప్రయోజనం చేకూరుతోంది. జీఎస్టీ వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 1.51 కోట్లకు పెరిగింది. అలాగే జీఎస్టీ వసూళ్లు రూ.22 లక్షల కోట్లకు పెరిగాయి. ఇక ప్రస్తుతం కేంద్రం చేపట్టిన జీఎస్టీ-2.0 సంస్కరణలవల్ల డబుల్ డిజిట్ గ్రోత్ సాధించే దేశంగా భారత్ అవతరిస్తుంది. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ సంస్కరణలు తెచ్చారు. దీని ప్రయోజనాలను ప్రజలం దరికీ చేరువ చేసే బాధ్యత అందరం తీసుకోవాలి. జీఎస్టీ సంస్కరణలతో ప్రాథమికంగా కొద్ది ఇబ్బందులు వచ్చినా... దేశ విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ విధానాన్ని స్వాగతిస్తున్నాం. దీర్ఘకాల సంస్కరణలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

### సంస్కరణలతో లబ్ధి చేకూరిదిలా...

"నిత్యావసర వస్తువులు, సబ్బులు, టూత్ పేస్టు, షాంపూలు, నెయ్యిలాంటి వస్తువులన్నీ 5 శాతానికి వచ్చాయి. ఏసీలు,ఫ్రిడ్జ్‌ల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయి. జీవిత బీమా, ఆరోగ్య బీమాలకు కూడా జీఎస్టీ సున్నా శాతానికి వెళ్లింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.750 కోట్ల వరకూ ఏపీకి ఆదా అవుతుంది. అగ్రిటెక్ యంత్రాలకు కూడా గణ నీయంగా పన్ను తగ్గింది. రైతులకు ప్రయోజనం కలుగుతుంది.ఇళ్ల నిర్మాణానికి వినియోగించే వస్తువుల ధరలు కూడా 5శాతం శ్లాబ్‌లోకి వచ్చాయి. నిర్మాణ రంగం పుంజుకుంటుంది. సాధారణ ప్రజలు కూడా వినియోగించుకునేలా ఎలక్ట్రానిక్స్ వస్తువులపై జీఎస్టీ తగ్గింది. అగ్రిటెక్, వ్యవసాయ పరికరాలపైనా పన్ను తగ్గింది. తక్కువ వ్యయంతో రైతులు ఉత్పత్తి సాధించగలుగుతారు. ఫార్మా సహా వివిధ రంగాలకు ఊతమిచ్చేలా ఈ సంస్కరణలున్నాయి. ఎంఎస్ఎంఈలకూ ప్రత్యేకంగా ఈ నిర్ణయం లబ్ధి కలిగిస్తుంది. టాక్స్ రీఫండ్‌ల ద్వారా ఆర్థిక ఉపశమనం కలుగుతుంది. లాజిస్టిక్స్ వ్యయం కూడా తగ్గి ధరలు మరింత దిగివచ్చే అవకాశం ఉంటుంది. ఏపీలో వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్ విధానానికి కూడా ఈ సంస్కరణలు ఎంతో ఉపయోగపడతాయి" అని సీఎం వివరించారు.

### ప్రతి ఒక్కరికీ సంస్కరణల ఫలాలు దక్కాలి

"రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలు దక్కాలి. చిట్టచివరి వ్యక్తికి ఈ అంశాలు తెలియాలి. పేదలు, మధ్యతరగతి సామాన్యులకు లబ్ధి కలిగేలా తీసుకున్న సంస్కరణలు ఇవి. పౌరులందరికీ జీఎస్టీ 2.0 సంస్కరణల ఫలాలు దక్కాలి. వినియోగ దారులు- వ్యాపారులకూ ఈ సంస్కరణల వల్ల లాభమే. సెప్టెంబరు 22 దసరా నుంచి జీఎస్టీ 2.0సంస్కరణలు అమల్లోకి వస్తున్నాయి. దీనిపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున ప్రచారం చేపడతాం. దసరా నుంచి దీపావళీ వరకు ఈ ప్రచారం నిర్వహిస్తాం. దీనికోసం మంత్రివర్గ ఉప సంఘం వేస్తాం. ఈ సంస్కరణలతో రెండంకెల వృద్ధి రేటు సాధించగల ఏకైక దేశంగా భారత్ నిలుస్తుంది. ఈ సంస్కరణలవల్ల నాలుగింతల మేర వస్తు వినియోగం పెరుగుతుంది. కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. రూ.2 లక్షల కోట్లమేర దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఉపశమనం కలుగుతోంది. ఆ మేర వ్యవస్థలో ఆర్థిక లావాదేవీలు కూడా పెరుగుతాయి. సంక్లిష్టమైన పరిస్థితులు ఉండవు. మొత్తంగా ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా జీఎస్టీ 2.0 రిఫార్మ్స్ మారుతాయి" అని చంద్రబాబు వివరించారు.

### మంచి నాయకత్వంతోనే అభివృద్ధి

"2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా... 2038నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుంది. ప్రధానిగా మోదీ సరైన నేత సరైన సమయంలో సరైన చోట ఉన్నారు. మంచి నాయకత్వం ఉంటే రాష్ట్రం, దేశం బాగుపడతాయి. పవన్ కల్యాణ్‌తో కలిసి మంచి నాయకత్వాన్ని రాష్ట్రానికి అందిస్తున్నాం. దేశాన్ని నెంబర్ 1గా చూడాలన్నది నా ఆకాంక్ష, అందులోనూ తెలుగు జాతిని అగ్రస్థానంలో చూడాలన్నదే నా లక్ష్యం. ఈ ఏడాది 12 శాతం వృద్ధి రేటు సాధించటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గత ఐదేళ్ల విధ్వంసంవల్ల తీవ్రంగా నష్టపోయాం. జీఎస్డీపీలో రూ.6 లక్షల కోట్లు కోల్పోయాం. తద్వారా రూ.70 వేల కోట్ల వరకూ ఆదాయం కూడా పోయింది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఇబ్బంది లేకుండా పాలసీలు తీసుకువచ్చి దీర్ఘకాలిక ప్రణాళికలు చేస్తున్నాం. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన చేస్తున్నాం. జీఎస్టీ సంస్కరణలతో ఆహార ఉత్పత్తుల, నిత్యావసరాల ధరలు ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గాయి. మందుల ధరలు తగ్గుతాయి. బీమాకు జీఎస్టీ లేకపోవటం వల్ల యూనివర్సల్ హెల్త్ పాలసీలో ప్రజాధనం ఆదా అవుతుంది. అగ్రిటెక్, వ్యవసాయరంగాల్లో జీఎస్టీ తగ్గటంవల్ల ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### కొన్ని పార్టీలకు అర్థం కావు... సహకరించవు

"చరిత్రలో జరిగే మంచి అంశాల్ని కొన్ని రాజకీయ పార్టీలు అర్థం చేసుకోలేవు, సహకరించవు కూడా. ప్రతిపక్ష హోదా అడుగుతున్న పార్టీది అదే పరిస్థితి. ఈ సంస్కరణల్ని స్వాగతించలేని పరిస్థితుల్లో ఆ పార్టీ ఉంది. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజాస్వామ్యంలో బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలపక్షాన పనిచేయాలి. ప్రజల ప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు సహకరించాలి. ప్రజా సమస్యల్ని గుర్తించి భవిష్యత్తులో ప్రజలు ఎలా ఉండాలన్న దానిపై పాలసీలు రూపొందించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలది. ఈ తరహా సంస్కరణల్ని కనీసం స్వాగతించాలి. లేదా ఆర్థం చేసుకోవడానికైనా ప్రయత్నించాలి. ఈ రెండూ కొందరు చేయలేకపోవటం బాధాకరం. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు ఎక్కువ సమయం అసెంబ్లీలో గడపాలి. మంత్రులు, అధికారులు బాధ్యతగా శాసనసభలో ఉండాలి. అసెంబ్లీ 175మంది ఎమ్మెల్యేల కోసం మాత్రమే కాదు... 5 కోట్లమంది ప్రజల కోసం. వారి భవిష్యత్ కోసం అసెంబ్లీ ఏర్పాటైంది. అసెంబ్లీ అనే దేవాలయంలో ప్రజాహితం కోసం చేసే నిర్ణయాలు జరుగుతాయి. ప్రజల జీవితాల్లో మార్పుల కోసం మనమంతా కూర్చుని చర్చించాలి. దేశాన్ని, భవిష్యత్ తరాన్ని ముందుకు నడిపించగలిగిన సంస్కరణ ఇది" అని చంద్రబాబు అన్నారు.

### ప్రజలకు మేలు జరుగుతుందనేదే సీఎం ఆలోచన: పయ్యావుల

ఇక అసెంబ్లీలో మరో తీర్మానాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందిస్తూ ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. జీఎస్టీ రెండోతరం సంస్కరణలకు మద్దతు తెలిపిన ముఖ్యమంత్రిని సభ అభినందించింది. జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్ర ఆదాయం కొంతమేర తగ్గుతున్నా... విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబే తొలిసారిగా సంస్కరణలను ఆమోదించారని పయ్యావుల అన్నారు.



రాష్ట్రానికి ఆదాయం తగ్గినా, ప్రజలకు లబ్ధి చేకూరుతుందనేదే ముఖ్యమంత్రి ఆలోచనని చెప్పారు. రూ.8వేల కోట్లు నష్టం వస్తుందని ఆర్థిక శాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్తే... ప్రజలకు రూ.8 వేల కోట్ల లబ్ధి చేకూరుతుంది కదా అని సీఎం అన్నారని పయ్యావుల గుర్తు చేసుకున్నారు. ప్రజల సంక్షేమాన్ని, ఆర్థిక సుస్థిరతను దృష్టిలో పెట్టుకుని సంస్కరణలను సీఎం మద్దతు తెలిపారన్నారు. జీఎస్టీ సంస్కరణలకు చంద్రబాబు మద్దతిచ్చారని తెలియగానే... జీఎస్టీ సంస్కరణలపై అందరిలోనూ ఓ పాజిటివ్ ధృక్కోణం ఏర్పడిందని పయ్యావుల వివరించారు.

# 8రోజులపాటు అసెంబ్లీ



- 27 అంశాలపై చర్చకు నిర్ణయం
- స్పీకర్ అధ్యక్షతన బీఏసీలో నిర్ణయం
- జీరో అవర్‌లోనూ మంత్రులుండాలన్న సీఎం

అమరావతి (చైతన్య రథం): ఏపీ అసెంబ్లీ సమావేశాలు 8 రోజులపాటు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం సభాపతి అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం లో పది రోజులపాటు నిర్వహించాలని నిర్ణయించినా.. తొలిరోజు సభ అనంతరం 8 రోజులకు కుదిస్తూ నిర్ణయించారు. అంటే, బీఏసీ సమావేశంలో ఈనెల 30 వరకు అసెంబ్లీ సమావేశాలు జరపాలని నిర్ణయించినా.. తాజా నిర్ణయంతో ఈనెల 27తో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి. రోజూఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరపాలని నిర్ణయించారు. సభలో చర్చించేందుకు 18 అంశాలను తెదేపా, 9 అంశాలను భాజపా ప్రతిపాదించింది. ప్రశ్నోత్తరాలతోపాటు శూన్య గంటలోనూ మంత్రులు ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జీఎస్టీ సంస్కరణలపై గురువారం శాసనసభ లో చర్చ జరిగింది. 19న జలవనరుల అంశం, 22న శాంతి భద్రతలు, 23న వైద్యారోగ్యం, 24న పరిశ్రమలు, 25న సూపర్-6, 26న క్వాంటం వ్యాలీ, 27న లాజిస్టిక్స్, 29న స్వర్ణాంధ్ర దిశగా ఏపీ, 30న రాయలసీమ-కోస్తా- ఉత్తరాంధ్ర అభివృద్ధి అంశంపై చర్చ జరగనుంది.

# జీఎస్టీ సంస్కరణలకు హృదయపూర్వక ఆమోదం

**ఎక్స్ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ.. ప్రధాని మోదీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ-2.0 సంస్కరణలను స్వాగతిస్తూ తీర్మానం చేసింది. చారిత్రాత్మకమైన, పరివర్తన కలిగించే తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలకు మద్దతుగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి తీసుకున్న చారిత్రక నిర్ణయాలపై ప్రధాని నరేంద్ర మోదీజీకి ఏపీ శాసనసభ హృదయపూర్వక ప్రశంసలు, అభినందనలు తెలియజేస్తోంది. జీఎస్టీ నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, హేతుబద్ధీకరించడంలో దార్శనిక చర్య సామాన్యులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తుంది. వ్యాపారాలపై సమ్మతి భారాన్ని తగ్గిస్తుంది. పన్ను వ్యవస్థలో పారదర్శకతను పెంచుతుంది. ప్రధాని నాయకత్వంలో గత 11ఏళ్లలో చేపట్టిన సంస్కరణలు సంక్షేమం మరియు అభివృద్ధికి అద్భుతమైన ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. ఇప్పుడు మనం తదుపరి తరం సంస్కరణలను ప్రారంభించాము. ఈ చారిత్రాత్మక సంస్కరణ సహకార సమాఖ్యవాదాన్ని మరింత బలోపేతం చేస్తుంది. వ్యాపార సౌలభ్యాన్ని, వ్యాపార వేగాన్ని ప్రోత్సహిస్తుంది. శ్రమతో కూడిన రంగాలకు మద్దతునిస్తుంది. ఇది వినియోగాన్ని పెంచుతుంది, పెట్టుబడిని పెంచుతుంది. మన దేశ ఆర్థిక వ్యవస్థయొక్క స్థిరమైన వృద్ధి పథానికి దోహదం చేస్తుంది. ఈ సంస్కరణలు భారతీయ కంపెనీల వృద్ధికి దారితీస్తాయి. ఇది స్వదేశీ వినియోగ నమూనాకు దారితీస్తుంది. భవిష్యత్తులో ఇది భారతీయ బ్రాండ్‌లను ప్రపంచవ్యాప్తం చేస్తుంది. ఈ సంస్కరణల కోసం జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయాన్ని సాధించడంలో ఆదర్శప్రాయమైన నాయకత్వానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌జీకి కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ సంస్కరణను హృదయపూర్వకంగా స్వాగతిస్తుంది. ప్రజలకు మరియు ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చడం కోసం దీనిని విజయవంతంగా అమలు చేయడంలో తన పూర్తి మద్దతును అందిస్తుంది' అని పేర్కొన్నారు.

### నెల్లూరు రోడ్డు ప్రమాద బాధితులకు
# రూ.5లక్షల చొప్పున పరిహారం

**ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి (చైతన్య రథం): నెల్లూరు జిల్లాలో బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంనుంచి పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.35 లక్షలు పరిహారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# టిడ్కో ఇళ్లు పూర్తిచేస్తాం

- రూ.4500 కోట్ల రుణానికి హడ్కో అంగీకారం
- ఇళ్ల సంఖ్యను భారీగా తగ్గించిన ప్రభుత్వం వాటినీ పూర్తి చేయలేదు
- ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం
- అసెంబ్లీలో మంత్రి నారాయణ



అమరావతి (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా రాష్ట్రంలో నిలిచిపోయిన టిడ్కో ఇళ్ల సముదాయాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల్లో సభ్యుల ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానమిస్తూ ఇళ్ల నిర్మాణం పూర్తికి మొత్తం రూ.6139 కోట్లు కావాలన్నారు. 2014-19లో కేంద్ర ప్రభుత్వం 7,01,481 టిడ్కో ఇళ్లను ఏపీకి కేటాయించింది. వీటిలో 5,14,000 ఇళ్ల నిర్మాణానికి పాలనా అనుమతులు తీసుకుని టెండర్లు పిలిచాం. గత ప్రభుత్వం వీటిని 2,61,640 కు తగ్గించడమే కాకుండా...ఇళ్లను కూడా పూర్తి చేయలేదు. రాష్ట్రంలో 51 ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తవగా...మరో 112 చోట్ల పూర్తిచేయాల్సి ఉంది. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, ఇళ్ల నిర్మాణం పూర్తికి మొత్తం రూ.6139 కోట్లు కావాలి. రూ.4500 కోట్లు రుణం ఇవ్వడానికి హడ్కో అంగీకరించింది. హడ్కో నిధులు విడుదల కాగానే బిల్లులన్నీ క్లియర్ చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు**

అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరాపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ రాబోయే రెండు మూడేళ్లలో మున్సిపాలిటీల్లో కొత్తగా 8,57,966 ఇళ్లకు తాగునీటి కొళాయి కనెక్షన్లు అందిస్తామన్నారు. కేంద్రం పలు పథకాల ద్వారా నిధులు విడుదల చేసినా...గత ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మున్సిపాలిటీల్లో పనులు మధ్యలో నిలిచిపోయాయి. అమృత్ 2.0, ఏఐఐబీ, అర్బన్ చాలెంజ్ ఫండ్ స్కీంల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అమృత్ 2.0 పథకం అమలుకు కేబినెట్ అనుమతి రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. మైదుకూరు మున్సిపాలిటీకి శ్రీశైలం కుడి కాలువ ద్వారా 0.18 టీఎంసీల నీటిని అందించేందుకు 99.7 కోట్ల అమృత్ నిధులతో పనులు ప్రారంభించనున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

# అర్హుల పింఛన్లు ఎక్కడా తొలగించలేదు

**- మండలిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి (చైతన్యరథం): అర్హులైన వారిలో ఏ ఒక్కరి పింఛన్ తొలగించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే వెంటనే భార్యకు స్పౌజ్ పెన్షన్ అందిస్తున్నామ న్నారు. శాసనమండలి సమావేశాల్లో గురువారం ప్రశ్నోత్తరాల్లో పింఛన్ పథకంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానంఇచ్చారు. 50ఏళ్ళు దాటిన వారికి పెన్షన్లకు పంపిణీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అని తెలిపారు. రాష్ట్రంలో 50-59 వయసు మధ్య ఉన్నవారు 11,98,501 మంది పింఛన్ పొందుతున్నారని.. ప్రతి నెల ఒకటో తేదీన పేదలకు పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్లను 3వేల నుంచి 4వేలకు ఒకేసారి పెంచామని...అర్హులకు ఎక్కడా పింఛన్లు తొలగించలేదని స్పష్టం చేశారు. పెన్షన్‌లను 200నుంచి వెయ్యి రూపాయలు చేసినా, ఆ తర్వాత నాలుగు వేలు చేసినా, రూ.15 వేల వరకు పెన్షన్ అందిస్తోన్న ఘనత తమ ప్రభుత్వానిదే అని మంత్రి తెలిపారు. నవంబర్ 2024నుంచిప్రతినెలా స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేస్తున్నా మన్నారు. పెన్షన్‌లు పెంచుకుంటూ పోతామనే మాయ మాటలు తాము చెప్పలేదన్నా రు. అత్యవసర పరిస్థితిలో ఊరు దాటి వెళ్ళిన వాళ్లకు మూడు నెలలు సమ యం ఇచ్చామన్నారు.అర్హులకు ఎక్కడా పెన్షన్‌లను తొలగించలేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ ప్రభుత్వంలో పెన్షన్ అందుతుందని స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు వారికి ఫించన్ మంజూరు చేశామన్నారు. ఆదివాసి గిరిజనులకు, కల్లు గీత కార్మికులకు పెన్షన్‌లను మంజూరు చేస్తున్నామని మంత్రి కొండపల్లి చెప్పారు.

# రాష్ట్రానికి 13,050 మెట్రిక్ టన్నుల యూరియా

- కేటాయించిన కేంద్రం
- రేపు గంగవరం పోర్టుకు చేరిక
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రానికి అదనంగా 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ గురువారం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 20వ తేదీకి రాష్ట్రంలోని గంగవరం పోర్ట్‌కు యూరియా చేరు తుందన్నారు. ఈ కేటాయింపుతో రైతు లకు మరింత వెసులుబాటు లభిస్తుం దన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నా మని, రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. రైతుల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం దృఢంగా నిలబడి ఉందని, తమ ప్రభుత్వం రైతుల సంక్షే మానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నా రు. రైతుల అవసరాలను, సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సమగ్ర దృష్టితో ముందుకెళ్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటలకు సరైన మార్కెటింగ్‌ను అందించడం కూటమి లక్ష్యమని తెలిపారు. సీఎం చంద్రబాబు చొరవతోనే ఇతర రాష్ట్రాల కన్నా అధిక మొత్తంలో రాష్ట్రానికి యూరియాను కేంద్రం కేటాయిస్తుందని మంత్రి అచ్చెన్న తెలిపారు.

## యూరియాపై
# చర్చకు సిద్ధం

**- మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు**

అమరావతి(చైతన్యరథం): యూరియా అంశంపై సభలో చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా విషయంలో రైతులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వారికి తెలియజెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గత ప్రభుత్వం, తమ ప్రభుత్వం మధ్య తేడాను ప్రజలు కూడా తెలుసుకోవాలన్నారు. యూరియా అంశంపై శాసనమండలిలో మంత్రి అచ్చెన్నాయుడు, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య గురువారం వాదోపవాదాలు జరిగాయి. యూరియా సహా రైతు సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా సమస్యలపై చర్చకు వైసీపీ సభ్యులు పట్టుబడుతూ తీర్మానం ఇచ్చారు. దీనిపై మండలి ఛైర్మన్ మోషేన్ రాజు స్పందిస్తూ.. తీర్మానాన్ని తిరస్కరిం చారు. మరో రోజు ఈ అంశంపై స్వల్ప కాలిక చర్చ చేపడతామన్నారు. అయినా వైసీపీ సభ్యులు శాంతించకపోవడంతో సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక కూడా వైసీపీ సభ్యులు ఆందోళన కొన సాగించారు. యూరియా అంశంపై చర్చ కు వాయిదాలు ఎందుకని బొత్స సత్య నారాయణ ప్రశ్నించారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ సభలో ఏ రోజు అజెండా ఆ రోజు ఉంటుందన్నా రు. ప్రభుత్వం చర్చ నుంచి పారిపోవడం లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఏం చేసింది.. ఈ ప్రభుత్వం ఏం చేసిందనే విషయాలు ప్రజలకు స్పష్టంగా తెలియాలన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏ నిర్ణయాలు తీసుకుందనే విషయాలు వారికి చెప్పాల్సిన బాధ్యత తమపై ఉంది.. చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



# జీఎస్టీ సంస్కరణలు చారిత్రాత్మకం

**- ప్రధాని మోదీని అభినందిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానంపై మంత్రి లోకేష్ హర్షం**



అమరావతి (చైతన్యరథం): జీఎస్టీ సంస్కరణలను ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తూ ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానాన్ని అమోదించటం చారిత్రాత్మకమని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన అసెంబ్లీ కార్యకలాపాల్లో తాను కూడా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. జీఎస్టీ విధానాన్ని మరింత సరళీకృతం చేసి హేతుబద్ధీకరించడం వల్ల సామాన్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. నిబంధనల భారాన్ని తగ్గించి, పన్ను వ్యవస్థలో పారదర్శకతను పెంచుతుందన్నారు. ఈ విషయంపై జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయాన్ని సాధించడంలో, సంస్కరణలను అమలు చేయడంలో అసాధారణ నాయకత్వ పటిమ చూపించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నామన్నారు.

# మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ వాయిదా

అమరావతి (చైతన్యరథం): అమరావతిలో ఈ నెల 19న జరగాల్సిన మెగా డీఎస్సీ - 2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా పడింది. ముందు నిర్ణయించిన ప్రకారం డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు 19న (శుక్రవారం) సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందించే కార్యక్రమం జరగాల్సి ఉంది. అయితే భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వహణ తేదీలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

# ప్రధాన దేవాలయాలకు ఛైర్మన్ల నియామకం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల బోర్డులకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్లను కూడా నియమించారు.

### దేవాలయాల ఛైర్మన్లు

1. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం (శ్రీశైలం) - పోతుగుంట రమేశ్ నాయుడు
2. శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం, శ్రీకాళహస్తి - కొట్టె సాయి ప్రసాద్
3. శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, కాణిపాకం- వి. సురేంద్ర బాబు (మణి నాయుడు)
4. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, ఇంద్రకీలాద్రి - బొర్రా రాధాకృష్ణ (గాంధీ)
5. శ్రీ వెంకటేశ్వర ఆలయం, వాడపల్లి - ముదునూరి వెంకట్రాజు

### టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీల ప్రెసిడెంట్లు

1. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్- ఏవీ రెడ్డి, 2. హిమాయత్‌నగర్, హైదరాబాద్ - నేమూరి శంకర్ గౌడ్, 3. బెంగళూరు - వీరాంజనేయులు, 4. ఢిల్లీ - ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి, 5. ముంబై -గౌతమ్ సింఘానియా, 6. విశాఖ పట్నం - వెంకట పట్టాభిరామ్ చోడే.

# జీఎస్టీ 2.0తో అభివృద్ధిలో కొత్త శకం

- సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు
- ఈ లబ్ధి గ్రామస్థాయి వరకు ప్రతి కుటుంబానికీ చేరాలి
- జీఎస్టీ సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలిరాష్ట్రం ఏపీ
- రాష్ట్ర ఆదాయం తగ్గుతున్నా.. ప్రజా ప్రయోజనాల కోసం నిలబడిన సీఎం చంద్రబాబు
- శాసనసభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా భారత దేశం మరో గొప్ప దశలోకి ప్రవేశించనుంది.. జీఎస్టీ సంస్కరణల ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుంది.. దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది.. తద్వారా మార్కెట్లో డిమాండ్ పెరిగి కొత్త పరిశ్రమల రాకకు, యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరగడానికి దోహదం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ సమష్టి నిర్ణయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22 నుంచి అమలు చేయబోతున్న జీఎస్టీ 2.0 సంస్కరణలపై శాసన సభలో గురువారం జరిగిన చర్చలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఇది దేశంలోని ప్రతి పౌరునికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో లబ్ధి చేకూర్చే నిర్ణయం అన్నారు. జీఎస్టీ పన్నుల విధానంలో చోటు చేసుకున్న అతి పెద్ద సంస్కరణలో రాష్ట్ర ప్రతినిధిగా భాగస్వామి కావడం సంతోషంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న ఎర్రకోట నుంచి ఈ విషయంలో చేసిన చారిత్రాత్మక ప్రకటన దేశ ప్రగతికి బాటలు వేస్తుంది. ఈ సంస్కరణలను ముందుండి నడిపిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కృషి అభినందనీయం. జీఎస్టీ మండలి 56వ సమావేశంలో ఈ సంస్కరణలను ఆమోదించింది. రాష్ట్ర ఆదాయాలకు నష్టం కలుగుతున్నా.. సామాన్యుల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విధానాలను బలంగా సమర్థించారు. ఆర్థిక ఆటుపోట్లను భరిస్తూ కూడా సంస్కరణల వల్ల ఆదాయం తగ్గిపోయే అవకాశం ఉన్నా.. జీఎస్టీ సంస్కరణలకు ముందుండి మద్దతు తెలిపినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. ఈ చారిత్రక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్ కావడం గమనార్హం. జీఎస్టీ పన్నుల విధానాన్ని సులభతరం చేయడం... సాధారణ ప్రజలకు ప్రత్యక్ష లాభాన్ని పెంచి, వ్యాపారులపై పన్నుల భారాన్ని తగ్గించి, పన్నుల విధానంలో పారదర్శకత తీసుకురానుంది. ఈ చారిత్రాత్మక సంస్కరణ పన్నుల విధానాన్ని సులభతరం చేసి వ్యాపార, పరిశ్రమల అభివృద్ధికి సహకరిస్తుంది.

### పజలకు, ఆర్థిక వ్యవస్థకు లాభదాయకమైన సంస్కరణ

ప్రజల పొదుపుని పెంచడం ద్వారా కొనుగోలు శక్తిని పెంచేందుకు, కొత్త పెట్టుబడులు ఆకర్షించి దేశాన్ని స్థిరమైన వృద్ధి మార్గంలో నిలపడానికి ఇది దోహద పడుతుంది.జీఎస్టీ రేట్ల సరళీకరణ ద్వారా ప్రజలు అత్యధికంగా ఉపయోగించే వస్తువుల సేవలకు డిమాండ్ పెంచి, ఉత్పత్తులను విస్తరించి కొత్త పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. తద్వారా ఆర్థిక వృద్ధికి దారి తీస్తుంది. ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకమైన సంస్కరణగా పవన్ పేర్కొన్నారు.

### పెరగనున్న గ్రామీణ ప్రజల ఆదాయం

రైతుల కోసం ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు పరికరాలు, ఇన్‌పుట్స్‌పై పన్నులు తగ్గించడం వల్ల సాగు వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకత పెరుగుతుంది. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయం పెరుగుతుంది. ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ వృద్ధి బలపడతుంది. తక్కువ ఆదాయ కుటుంబాలకోసం పాలు, పెరుగు, పన్నీర్ లాంటి నిత్యవసరాలపై పన్ను 5 శాతం నుంచి 0 శాతానికి తగ్గించడం ద్వారా రోజు వారి వ్యయాన్ని తగ్గించినట్టు అవుతుంది. నెయ్యి, వెన్న, వంట పాత్రలపై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం ద్వారా కుటుంబ బడ్జెట్‌కి చాలా ఉపశమనం కలిగిస్తుంది. సబ్బులు, షాంపూలు, పేస్టులు వంటి వ్యక్తిగత సంరక్షణ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ద్వారా వాటి ధరలు గణనీయంగా తగ్గుతాయి. తద్వారా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత మెరుగవుతుంది. మధ్య తరగతి కోసం కార్లు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలపై పన్ను 18 శాతానికి తగ్గించడం ద్వారా వాటి ధరలు అందుబాటులోకి వచ్చి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. గృహ నిర్మాణానికి అవసరం అయిన సిమెంటు మీద పన్ను 18 శాతానికి తగ్గించడం నిర్మాణ వ్యయం తగ్గి సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి ఉపయోగపడుతుందని పవన్ అన్నారు.

### ఆరోగ్య రంగానికి ఊతం

ఆరోగ్య రంగంలో ఔషధాలపై పన్ను 12 శాతం నుంచి 5 శాతానికీ, అత్యవసర మందులపై పన్ను 5శాతం నుంచి 0కి తగ్గించడం ద్వారా రోగులకి కీలక ఉపశమనం కలిగి అందరికీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా ప్రజారోగ్యం మెరుగుపడుతుంది. జీవిత ఆరోగ్య బీమాపై పన్ను 0 శాతానికి తగ్గించడం ద్వారా మరిన్ని కుటుంబాలు బీమా పొంది వారి జీవన పరిస్థితులు మెరుగుపడతాయి. ఎంఎస్‌ఎంఈలకు వ్యాపార ఉత్పత్తులు, మధ్యవర్తిత్వ సేవలపై పన్ను సరళీకరణ ద్వారా ఖర్చులు తగ్గించటంతో పోటీ వాతావరణం పెరుగుతుంది. విద్యా రంగానికి సంబంధించిన వస్తువులపై పన్ను తగ్గింపు విద్యను మరింత అందుబాటులోకి తీసుకు వస్తుంది. జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ప్రజల చేతుల్లో నగదు పెరుగుతుంది. తద్వారా వస్తువుల వినియోగం మరింత పెరిగి నూతన పెట్టుబడుల సేకరణకు ఉపయోగపడుతుంది. వాణిజ్య పరిశ్రమలకు సంబంధించి జీఎస్టీ సంస్కరణల అమలుకి సహకరించిన అన్ని వాణిజ్య సంఘాలు, పారిశ్రామిక సంఘాలకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోందని పవన్ స్పష్టం చేశారు.

### ప్రజలకు అవగాహన కల్పిద్దాం

జీఎస్టీ సంస్కరణల లాభాలు ప్రతి కుటుంబానికి చేరే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలందరికీ తెలియజేసే కార్యక్రమం చేపట్టాలి. గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు ప్రజలను నేరుగా కలిసి వారికి ఎలా లబ్ధి చేకూరుతుందో చెప్పాలి. ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి కుటుంబం జీఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకుని లాభాలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చారిత్రాత్మక మార్గదర్శక సంస్కరణలను ఆహ్వానిస్తూ వాటిని విజయవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తుందని పవన్ తెలిపారు.

# ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యం

- రూ.2,400 కోట్లు ఖర్చు అంచనా
- రెండేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళిక
- అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి అవి రెండేళ్లలో పూర్తి చేయడం ద్వారా అక్కడి ప్రజల రుణం తీర్చుకుంటామని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.అసెంబ్లీ సమావేశాలు తొలిరోజైన గురువారం ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు అడిగినప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి కాగల వ్యయాన్ని అంచనా వేశామన్నారు. ఇందుకు సుమారు 2,400 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రెండేళ్ల కాలావధి నిర్ణయించుకుని మొదటి సంవత్సరం రూ.1000-1200కోట్లు, రెండో సంవత్సరం కూడా వెయ్యి, పన్నెండు వందల కోట్లు ఖర్చు చేసి ఆ ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఆయన సూచన మేరకు రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేయడానికి కృత నిశ్చయంతో ఉందన్నారు. బిఆర్ఆర్ వంశధార, వంశధార నాగావళి లింక్, తోటపల్లి, తారకరామ తీర్థసాగర్,జంజావతి, హీరమండలం లిఫ్ట్, నాగావళి-చంపావతి, మహేంద్ర తనయ, వంటి కీలకమైన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి వివరించారు. రాయలసీమలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు హంద్రీనీవాను కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలా పూర్తిచేసి ప్రారంభించారో అదే మాదిరి ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు కూడా రెండేళ్లలో పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ఉత్తరాంధ్రకు అత్యంత కీలకమైన పోలవరం ఎడమ ప్రధాన కాలువకు రూ.1200 కోట్లు కేటాయించి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లబోతున్నామన్నారు.

వంశధార కుడి కాలువ ఆయకట్టుకు సంబంధించి శివారు భూములకు నీరు అందడం లేదన్న సభ్యుల ప్రశ్నలకు కూడా మంత్రి స్పష్టమైన సమాధానం ఇచ్చారు. వంశధార కుడికాలువ ఆయకట్టు 4600 ఎకరాలు కాగా అందులో ఇప్పటికీ 2104 ఎకరాలకు నీరు అందని మాట వాస్తవమేనని, 2011లో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ మధ్యలో పనులు నిలిపి వేయడం వల్ల ఈ పరిస్థితి ఉత్పనమైందని మంత్రి వివరించారు. వంశధార కుడి కాలువ లైనింగు, 8 ఓటీలు, రెండు స్ట్రక్చర్లు నిర్మించడం ద్వారా పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు అని అంచనా వేశామన్నారు. ఇందుకు పది కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. పూర్వపు నిర్మాణ సంస్థ ఒప్పందాన్ని ప్రీ క్లోజర్ చేసి, వంశధార కుడి కాలువ అయకట్టు శివారు 11 గ్రామాలకు సాగునీరు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి నిమ్మల హామీ ఇచ్చారు.

# కరేడులో స్వచ్ఛందంగా భూసేకరణ



● ఇప్పటికే రైతులు 500 ఎకరాలు ఇచ్చారు
● ఎకరాకు రూ.20 లక్షల వరకు నష్టపరిహారం
● భూసేకరణ బాధితులకు ఉపాధి కల్పిస్తాం
● శాసనమండలిలో రెవెన్యూ మంత్రి అనగాని

అమరావతి (చైతన్యరథం): ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక హబ్ కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛం దంగా ముందుకు వస్తున్నారని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శాసనమండలిలో గురువారం కరేడు భూముల సేకరణపై వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇప్పటికే 500 ఎకరాలు ఇచ్చేందు కు రైతులు లిఖిత పూర్వకంగా అనుమతి నిచ్చారని, 300 ఎకరాలకు పరిహారం కూడా చెల్లించామని చెప్పారు. రామా యపట్నం పోర్టుకు అనుసంధానంగా కరేడులో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక హబ్ కోసం 8,200 ఎకరాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రారంభంలో రైతులు కొంతమేరకు భూసేకరణపై అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ కలెక్టర్, భూసేకరణ అధికారులు వెళ్లి రైతులతో చర్చించి వారి అనుమానాలు నివృత్తి చేశారని చెప్పారు. ఆ గ్రామంలో ఎకరం ఐదు లక్షలు ఉండగా భూసేకరణ చట్టం ప్రకారం రెండున్నర రెట్లు అదనంగా రూ.12.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అయితే తమవి సారవంతమైన భూములు.. రెండు పంటలు పండుతాయని, నష్టపరిహారం పెంచాలని రైతులు కోరడంతో ఎకరాకు 20 లక్షల వరకు నిర్ణయించామని చెప్పారు. దీంతో రైతులు సమ్మతించి భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. భూ సేకరణ కారణంగా ఉపాధి కోల్పోయే కుటుంబాలకు ఉపాధి కల్పించడం ప్రభుత్వానిదే బాధ్యతని చెప్పారు. పారిశ్రామిక హబ్ ఏర్పాటు ద్వారా వచ్చే ఉద్యోగావకాశాల్లో స్థానికులకే మొదటి అవకాశాలు ఇస్తామని చెప్పారు. పరిశ్రమలు స్థాపిస్తేనే ఉద్యోగాలు వస్తాయని, అప్పుడే సంపద పెరుగుతుందని చెప్పారు. నిజమైన పారిశ్రామికాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కియా పరిశ్ర మ రాబట్టే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో పరుగులు తీసిందన్నారు. వాన్‌పిక్ ప్రాజెక్ట్ వచ్చి ఉంటే తమ బాపట్ల జిల్లా రూపు రేఖలే మారిపోయి ఉండేవన్నారు. రేపటిరోజున కరేడు ప్రాంతం కచ్చితంగా ప్రగతి పథంలో దూసుకెళుతుందని తెలిపారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల భర్తీకి చర్యలు

*- రోగులకు 63 రకాల పరీక్షలు*
*- 175 రకాల మందుల పంపిణీ*
*- క్యాన్సర్ గుర్తింపునకు ప్రత్యేక సర్వే*
*- వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్*



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శాసనమం డలిలో గురువారం ప్రశ్నోత్తరాల సందర్భంగా సీనియర్ సభ్యులు సోము వీర్రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఉన్న 560 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 3,920 పోస్టుల కు గాను 344 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ ఖాళీల భర్తీకి కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని రకాల ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీకి అవసరాలకు తగ్గట్లు నియా మకాల నోటిఫికేషన్లు ఇస్తున్నామని వివరించారు. 2023-24 లో పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా 69.54 లక్షల మంది రోగు లు సేవలు పొందారు. 2024-25లో ఈ సంఖ్య 73.67 లక్షల కు పెరిగింది. మురికివాడలు, బాగా వెనుకబడిన ప్రాంతాల్లో ఈ ఆరోగ్య కేంద్రాలు నడుస్తున్నందున్న స్థానిక పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. వీటిల్లో 63 రకాల ల్యాబ్ పరీక్ష లు, 175 రకాల మందులను ఉచితంగా రోగులకు అందచేస్తు న్నాం. 2020 - 21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఈ కేంద్రాల నిర్వహణ కోసం రూ.10,341.81 కోట్లను జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఖర్చుపెట్టామని వివరించారు.

**క్యాన్సర్ లక్షణాల గుర్తింపునకు ప్రత్యేక సర్వే**

*గత 2022-23లో 73 వేల కొత్త క్యాన్సర్ కేసులు నమో దైతే దురదృష్టవశాత్తు 42 వేల మంది ప్రాణాలు విడిచారు. ఈ పరిస్థితుల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను లక్షణాల ఆధారంగా ప్రాథ మిక దశలోనే గుర్తించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేం దుకు క్షేత్రస్థాయి సిబ్బంది సేవలు వినియోగించుకుంటున్నాం. 4.10 కోట్ల మందికి క్యాన్సర్ లక్షణాలు గుర్తించేందుకు స్క్రీనిం గ్ చేయబోతున్నామని వివరించారు. ఈ స్క్రీనింగ్ ఎలా చేయాల న్న దానిపై వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ కేసుల గుర్తింపు సర్వే పూర్తయితే ఏఎన్ఎం, ఇతర సిబ్బంది అన్ని రకాల రోజువారీ విధులకు యధావిధిగా హాజరవుతారని వివరించారు.*

# మద్యం అక్రమాలకు చెక్

- 2019-24లో 65,918 కేసుల నమోదు
- కూటమి పాలనలో గణనీయంగా తగ్గుదల
- అక్రమ షాపులపై కఠిన చర్యలు
- ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్‌తో పారదర్శకత
- కొత్త బ్రాండ్లతో ఆదాయం పెరుగుదల
- ఐడీ లిక్కర్ నిర్మూలనకు అవగాహన
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నకు సమాధానం




అమరావతి (చైతన్యరథం): శాసనమండలిలో గురువారం వేడెక్కింది. రాష్ట్రంలో అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల విస్తృతి, కల్తీ మద్యం వల్ల ప్రాణనష్టం వంటి అంశాలపై ప్రతిపక్షం తీవ్ర విమర్శలు గుప్పించగా, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఘాటుగా సమాధానం ఇచ్చారు. ముందు వైసీపీ ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, శివరామరెడ్డి, మరికొందరు సభ్యులు మాట్లా డుతూ అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు, అనంతపురం, కడప జిల్లాల్లో అక్రమ మద్యం వల్ల అనేక మంది మృత్యువాత పడుతున్నారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో 8 నుంచి 15 వరకు బెల్ట్ షాపులు ఉన్నాయని, పాఠశాలలు, ఆలయాల మధ్యలో కూడా షాపులు ఉండటం చిన్నారులను కూడా మద్యం బానిసలుగా మారుస్తోందని విమర్శించారు. దీనికి మంత్రి కొల్లు సమాధానం ఇస్తూ ప్రతిపక్షం సభను తప్పుదోవ పట్టిస్తోంది. 2019-24 కాలంలోనే 65,918 అక్రమ మద్యం కేసులు నమోద య్యాయి. కొవిడ్ సమయంలో 9,125 కేసులు వెలుగులోకి వచ్చాయి. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మద్యం నియంత్రణలో గణనీయమైన ఫలితాలు సాధిం చామని స్పష్టం చేశారు.

**ఐడీ లిక్కర్ నిర్మూలనకు చర్యలు**

జూన్ 2024 వరకు ఉన్న కేసులు 21,143 కాగా, ఆ తరు వాత గణనీయంగా తగ్గి కేవలం 8,827 కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలపై 22 షాపులు సస్పెండ్ అయ్యాయని, మళ్లీ తప్పు చేసిన రిపీట్ ఆఫెం డర్లకు శాశ్వత రద్దు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్ ప్రవేశపెట్టడం ద్వారా మద్యం పంపిణీలో పారదర్శకత తీసుకువచ్చా మని, పనికిరాని బ్రాండ్లను తొలగించి కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్ట డంతో రాష్ట్ర ఆదాయం పెరిగిందని చెప్పారు. ఐడీ లిక్కర్ నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో "నవోదయ" అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నా మని, నెలాఖరులోపు ఆంధ్రప్రదేశ్‌ను ఐడీ ఫ్రీ స్టేట్‌గా మార్చడ మే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. స్పిరిట్ కల్తీ కేసుల విష యానికొస్తే తెలంగాణ, కేరళ నుంచి సరఫరా జరుగుతోందని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని అరెస్టులు కూడా చేసిన ట్లు వెల్లడించారు. మద్యం అక్రమాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఎక్కడ ఏ అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# క్లీన్ ఎనర్జీతో 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్

- పీఎం సూర్యఘర్‌కు బ్యాంకర్లు సహకరించాలి
- మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ భవనాలకు రూఫ్ టాప్
- అర్హులైన ఎస్సీ, ఎస్టీల గృహాలకు సోలారైజేషన్
- అసెంబ్లీలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 5006.35 మెగావాట్లుగా ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోలార్ విద్యుత్ ఉత్పత్తి, సామర్థ్యంపై అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో బుధవారం మంత్రి సమాధానమిచ్చారు. సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని విస్తృతంగా పెంచే దిశగా ప్రభుత్వం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పాలసీ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 78.50 గిగావాట్లకు పెంచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీ వసతిగృహాల్లో 2,138 కిలోవాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పీఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద 415 పాఠశాలల్లో 3,550 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు టెండర్లు పిలిపించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాలు, పంచాయతీ భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ భవనాలు, పంచాయతీ భవనాలపై 130 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం విజయవంతంగా అమలు చేయడానికి బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. బ్యాంకుల మద్దతు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశమయ్యారని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులపై విద్యుత్ భారం పడకుండా అర్హులైన వారికి ప్రభుత్వం ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేస్తోందని స్పష్టం చేశారు. 2014-19 మధ్య తెలు గుదేశం ప్రభుత్వ హయాంలో 9 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని రాష్ట్రం సాధించగా వైసీపీ పాలనలో విద్యుత్ రంగం సర్వ నాశనమైందని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడి పెట్టే పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులను వైసీపీ నేతలు బెదిరించి రాష్ట్రం నుంచి తరిమివేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఏపీ మిగులు విద్యుత్ రాష్ట్రం నుంచి లోటు విద్యుత్ రాష్ట్రంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎన్నో అవకాశాలున్న వాటిని సద్వినియోగం చేసుకో కుండా..తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని అసెంబ్లీ సాక్షిగా గౌరవ సభ్యులకు వివరించారు.

చైతన్యరథం

# 32 ప్రాంతాల్లో సీ ప్లేన్ సర్వీసులు

## మెహెయిర్ సంస్థ ప్రతినిధుల ఆసక్తి: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో భేటీ




అమరావతి (చైతన్యరథం): సచివాలయంలోని ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయంలో రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదు పా యాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని గురువారం సీ ప్లేన్ రంగ ప్రముఖ సంస్థ మెహెయిర్ సీ ప్లేన్ కంపెనీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సీ ప్లేన్ సర్వీసులు అందించేం దుకు ఆసక్తి వ్యక్తం చేశారు. 32 ప్రాంతాల్లో సీ ప్లేన్ సర్వీసులు అందించేందుకు ఉత్సుకతను తెలిపింది.

భవిష్యత్తులో సీప్లేన్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఏపీ రాబోయే రోజుల్లో ఏవియేషన్ హబ్‌గా మారబోతుందని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పూర్తిస్థాయి ప్రతిపాదనలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తుందని సంస్థ ప్రతినిధులకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. సుస్థిరమైన ప్రభుత్వం, బలమై న నాయకత్వంతో రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు భారీగా వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఏపీ దేశంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా మారనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సీప్లేన్ సర్వీసుల కల్పన ద్వారా టూరిజం రంగం కూడా అభివృద్ధి చెందుతుందని, సీ ప్లేన్‌ల రాకతో రాష్ట్రంలో మారుమూ ల గ్రామీణ ప్రాంతాలకు సైతం అనుసంధానం పెరుగుతుంది. రాష్ట్రంలో సీప్లేన్ సర్వీసులు ప్రారంభం కావడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని వివరించారు.

# మద్యం కుంభకోణంలో రంగంలోకి ఈడీ

## - 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో సోదాలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల విలువైన లిక్కర్ స్కామ్ అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. మద్యం కుంభకోణంలో దర్యాప్తు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీలో ఈడీ తనిఖీలు చేపట్టింది. మద్యం కుంభకోణం కేసులో నిందితుల సంస్థలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురిని ఏపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో రూ. 3, 500 కోట్ల మేర స్కాం జరిగిందంటూ సిట్ అధికారులు నిగ్గు తేల్చారు.

### ఎయిరిండియా విమానానికి తప్పిన పెనుప్రమాదం

విశాఖపట్నం (చైతన్యరథం): ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం 2.38 గంటలకు ఎయిరిండియా విమానం హైదరాబాద్ బయ లుదేరింది. కొంతదూరం వెళ్లాక విమానం రెండో ఇంజిన్‌లో పక్షి ఇరు క్కుంది. దీంతో అప్రమత్తమైన పైలట్ చాకచక్యంగా వ్యవహరించి 3 గంటల సమయంలో విమానాన్ని తిరిగి వెనక్కి తీసుకొచ్చి సురక్షితంగా ల్యాండ్ చేయడంతో అప్పటివరకూ తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఎయిర్ ఇండియా యాజమాన్యం ఏర్పాట్లు చేసింది.

ఈ వ్యవహారానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని.. సిట్ నుంచి ఈడీ సీనియర్ అధికారులు మూడు రోజుల క్రితమే తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం 23 సూట్ కేసు కంపెనీలలో జరిగిన లావాదేవీలపై ఈడీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అలాగే ఇప్పటి వరకు సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై సైతం ఈడీ దృష్టి సారించింది. అదే విధంగా హైదరాబాద్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న రూ. 11 కోట్ల నగదు వివరాలను సైతం ఈడీ అధికారులు అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. దాదాపు 10 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ దాడుల సమయంలో ఎప్పటికప్పుడు సిట్ అధికారులతో సంప్రదిస్తూ.. తమకున్న సందేహాలను ఈడీ అధికారులు నివృత్తి చేసుకున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఆస్తులపై ఈడీ దృష్టి సారించినట్లు సమాచారం. మద్యం వ్యవహారంలో పొందిన ముడుపులను షెల్ కంపెనీలకు పంపించి, తద్వారా నల్ల ధనాన్ని వైట్‌గా మార్చారంటూ ఇప్పటికే రాజ్ కసిరెడ్డి వ్యవహారాన్ని సిట్ నిగ్గు తేల్చింది.

మరోవైపు ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. ధనుంజయరెడ్డి (ఏ-31), కృష్ణమోహన్రెడ్డి (ఏ-32), బాలాజీ గోవిందప్ప (ఏ-33), పైలా దిలీప్ (ఏ-30)లు బెయిల్‌పై బయటకు రాగా.. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేష్‌నాయుడు సహా మొత్తం 8 మంది ఇంకా జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే.

# నవరాత్రులకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ

- హైదరాబాద్ నుంచి విజయవాడకు..
- భక్తుల సౌకర్యార్థం శీఘ్ర దర్శన టిక్కెట్లు
- దుర్గగుడి వరకు ప్రత్యేక మినీ వాహనాలు
- మంత్రి ఆనంకు ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని విజ్ఞప్తి



విజయవాడ (చైతన్యరథం): ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విజయవాడలో జరగబోయే కనకదుర్గమ్మ దసరా నవ రాత్రుల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టా లని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ గురువారం సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి ఆనంద రామనారాయణరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు హైదరాబాదు–విజయ వాడ ప్రత్యేక ప్యాకేజీ టూర్‌ను ఏపీటీడీసీ నిర్వహించనుంది. ఇందులో అమ్మవారి శీఘ్ర దర్శనంతో పాటు పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. రూ.500 విలువైన 60 శీఘ్ర దర్శన టిక్కెట్లు మంజూరు చేయాలని, అలాగే 12 సీటర్ల మినీ వాహనాలను గిరిపాదం నుంచి ఆలయ ప్రాంగణం వరకు నడిపేం దుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంత మైన ఆధ్యాత్మిక అనుభవం కలిగించేలా యాత్రా సేవ లను అందించేందుకు ఏపీటీడీసీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# ఐపీఎస్ సంజయ్‌కు చుక్కెదురు

## - బెయిల్ పిటిషన్ కొట్టేసిన ఏసీబీ కోర్టు

విజయవాడ (చైతన్యరథం): ఐపీఎస్ అధికారి సంజయ్ కుమార్‌కు ఏసీబీ కోర్టులో నిరాశ ఎదురైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. పదవిలో ఉండగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సంజయ్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వ్ చేసింది. ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అగ్నిమాపకశాఖ డీజీ, సీఐడీ ఏడీజీగా సంజయ్ పనిచేసినప్పుడు రూ.1.5 కోట్ల మేర ప్రభుత్వ నిధులు దుర్వినియోగమయ్యాయని విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. సంజయ్ ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

# చెవిరెడ్డి సోదరుడి భూ దందా

- ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేసుకున్నారు
- అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు
- మాజీ ఎమ్మెల్యే మేడా ప్రమేయంతో
- భూమి మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేశారు
- భూమన ఉద్యోగం నుంచి తొలగించారు
- ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదులు

మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురు వారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో అనకాపల్లి డీసీఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు అర్జీలు స్వీకరించారు. పేరూరు గ్రామ దాఖలా సర్వే నెం.24/బీ విస్తీర్ణంలో భాగ పరిష్కారం 0.33 సెంట్లు ఆయకట్టు విస్తీర్ణం, 0.13 సెంట్లు భూమి ఉండగా ఈ భూమిని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి పేరుతో ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేసుకు న్నారని తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తుమ్మలగుంట గ్రామా నికి చెందిన ఎన్.కేశవులు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రమేయంతో జరిగిందని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### భూమి మరొకరి పేరుపైకి ఎక్కించారు

పాటూరు పంచాయతీలోని సర్వే నెం.1102/1లో ఖాతా నెం. 365



కింద తమ పేరున ఉన్న 2.36 ఎకరాల భూమిని మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అక్రమంగా పెనగలూరు కాంతమ్మ పేరు మీద ఆన్‌లైన్‌లో మార్చారని అన్నమయ్య జిల్లా నందలూరు మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన భూమిరెడ్డి రాజమ్మ ఫిర్యాదు చేశారు. ఈ అన్యాయంపై గతంలో అప్పటి తహసీల్దార్ దార్ల చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసు కోలేదని వివరించారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమిని తిరిగి తమ పేరు మీద మార్చాలని కోరారు.

### భూమన ఉద్యోగం నుంచి తొలగించారు..

1994 నుంచి తిరుమలలో లడ్డూ కౌంటర్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నామని తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన ఎ.కన్నయ్య తెలిపారు. అయితే గత ప్రభుత్వ కాలంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి రాజకీయ కారణాలతో తమను విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఈ అన్యాయంపై తిరుపతి కోర్టు, హైకోర్టును ఆశ్రయించగా మళ్లీ విధుల్లోకి తీసు కోవాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ భూమన కరుణాకర్‌రెడ్డి వాటిని అమలు చేయలేదని తెలిపారు. టీఎన్‌టీ యూసీకి తాము సభ్యులమని, అలాగే భూమనకు ఓటు వేయలే దని కారణం చూపి తమ అర్జీలను కూడా తిరస్కరించారని ఫిర్యా దు చేశారు. తమ సమస్యను పరిష్కరించి తిరిగి టీటీడీలో విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

### మంచి భూమిని ఆక్రమించి ఊట భూమి ఇచ్చారు

తమ గ్రామంలో ఖాతా నెంబర్ 1795లో సర్వే నెంబరు 402లో వంశపారపర్యంగా 7.96 భూమి ఉందని అన్నమయ్య జిల్లా పెద్దమండెం మండలం రెడ్డివారిపల్లె గ్రామానికి చెందిన చంద్రకళ తెలిపారు. ఇందులో తన మామ తమ మేనల్లుడైన సుబ్బరాయుడు(లేటు)కు 3.97 సెంట్ల భూమిని దానంగా ఇచ్చా డు. ఈయన గత వైసీపీ ప్రభుత్వంలో మంచి భూమిని ఆక్రమించి తమకు పనికిరాని రాళ్ల, ఊట భూమిని ఇచ్చారని తెలిపింది. గత ప్రభుత్వంలో దీనిపై ప్రశ్నించినందుకు రేషన్‌కార్డు తీసేసి ప్రభుత్వ పథకాలు రాకుండా చేశారు. 1988 నుంచి తమ మామ పేరుతో ఉన్న సర్వీస్‌ను 2022లో మార్చేశారు. ఎన్నో అడ్డంకులు సృష్టించి ఇబ్బందులు పెట్టారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్క రించాలని అభ్యర్థించారు.

## విజయనగరం పేలుళ్ల కుట్ర కేసు... మరోసారి ఉలిక్కిపడ్డ విజయనగరం



విజయనగరం పేలుళ్ల కుట్రకేసులో దర్యాప్తు ముమ్మరం చేసింది ఎన్ఐఏ. దేశవ్యాప్తంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌లను అణచివేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. విజయనగరం ISIS కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సమాచారంతో ఎన్ఐఏ ఎనిమిది రాష్ట్రాల్లో ఏక కాలంలో పెద్దఎత్తున సెర్చ్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ దాడులు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో 16 ప్రాంతాల్లో ఒకేసారి జరిగాయి. స్థానిక పోలీసుల సహకారంతో ముందస్తు ప్రణాళిక వేసి ఈ దాడులు విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ దాడుల్లో పలు కీలక డిజిటల్ పరికరాలు, పత్రాలు, నగదు, అనుమానాస్పద వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం పోలీసులు జులై 2025లో కేసు నమోదు చేసిన తర్వాత ఈ దర్యాప్తు మొదలైంది. ఆ సమయంలో సిరాజ్ ఉర్ రహ్మాన్ అనే వ్యక్తిని విజయనగరం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగించే కెమికల్స్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సిరాజ్ ప్రభుత్వం పై యుద్ధానికి కుట్ర చేస్తున్నట్టు వెల్లడించాడు. సిరాజ్ సమాచారంతో హైదరాబాద్ లో సయ్యద్ సమీర్ అనే మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

ఈ ఇద్దరూ సోషల్ మీడియా వేదికల ద్వారా యువతను తమ జిహాదీ భావజాలంతో లోబరుచుకొని ఉగ్రవాద మార్గంలో నడిపిస్తున్నట్టు బయటపడింది. ఆ తరువాత ఆగస్టు 27న అరీఫ్ హుస్సేన్ అలియాస్ అబూ తాలిబ్ అనే కీలక నిందితుడిని అరెస్టు చేశారు ఎన్ఐఏ అధికారులు. అతను విదేశాలకు పారిపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. నెపాల్ సరిహద్దు మార్గంలో ఆయుధాల సరఫరాకు ప్రయత్నించినట్టు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం ఈ కేసు భారతీయ న్యాయ సంహిత 2023, ఎక్స్‌ప్లోసివ్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ 1908, యూఏ(పి) యాక్ట్ కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు అధికారులు.

ఎన్ఐఏ అధికారులు చేపట్టిన ఈ దాడులు దేశంలో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేధించడానికి ఒక కీలక పరిణామంగా భావించవచ్చని అంచనా వేస్తున్నారు అధికారులు. ఈ దాడులు జరిగిన నేపథ్యంలో విజయనగరం జిల్లావాసులు మరోసారి ఉలిక్కిపడ్డారు. జిల్లాలో ఇంకా ఎవరైనా సిరాజ్ అనుచరులు ఉన్నారా? ఎన్ఐఏ ఆ దిశగా దర్యాప్తు చేస్తుందా? అన్న వార్తలు చక్కర్లు కొట్టడంతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

## జగన్ ప్రచార పిచ్చే వైసీపీని దారుణంగా ఓడించింది

**●తమ ఆస్తులు.. భూముల వివరాలపై జగన్ బొమ్మలేమిటని ప్రజలు ఆగ్రహించారు**

**●స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ నిర్ణయం తాను పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నప్పటిది : ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రచార పిచ్చితో జగన్మోహన్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వంలో తీసుకున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్ణయాన్ని అటకెక్కించాడని, పాస్ పుస్తకాలు, సర్వే రాళ్ల సహా ప్రతి దానిపై తన ఫోటో ఉండాలనే పిచ్చి పరాకాష్టకు చేరినందునే వైసీపీని ప్రజలు దారుణంగా ఓడించారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని 12 వ వార్డులో గురువారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డుల్ని పంపిణీ చేసిన అనంతరం ప్రజలను, మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. తాను పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ప్రజలకు సరికొత్త రేషన్ కార్డులు అందించాలనే నిర్ణయం తీసుకున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఆనాటి నిర్ణయాన్ని జగన్ తన ఫోటోలు ముద్రించుకోవాలనే దురాలోచనతో సరిగా అమలుచేయకుండా పక్కన పెట్టేశాడన్నారు.

**సంక్షేమ పథకాలే పార్టీల దశ..దిశ నిర్ణయిస్తాయి..**

కూటమిప్రభుత్వం సూపర్ -6 హామీలు అమలుచేసి, ప్రజలు మెచ్చేలా పరిపాలన సాగిస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలుచేయని సంక్షేమపథకాలు ఏపీలో చంద్రబాబు అమలు చేస్తున్నారని, ఇదేమీ సామాన్యవిషయం కాదని ప్రత్తిపాటి చెప్పారు. నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధి పథకాలు కూడా త్వరలోనే అమల్లోకి వస్తాయన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు.. పెట్టుబడులు వచ్చినప్పుడే పేదలకు ఆదాయం, సంక్షేమం అందించడం సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదిశగానే ఆలోచన చేస్తున్నారని, ప్రజల సంతోషమే ఆయనకు ఎప్పుడూ ముఖ్యమన్నారు. సంక్షేమ పథకాలే రాజకీయపార్టీలు, పాలకుల దశ, దిశ నిర్ణయిస్తాయన్నారు.

**ప్రజలకు మేలుకలిగే నిర్ణయమైనందునే అసెంబ్లీలో చర్చ..**

జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకే ఎక్కువ మేలు జరుగుతుందని, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ట్యాక్స్‌ల భారాన్ని కేంద్రం పూర్తిగా తగ్గించిందన్నారు. గతంలో ఉండే 4 శ్లాబులను ఇప్పుడు రెండుకే పరిమితం చేశారన్నారు. ప్రజలకు మేలు కలిగే నిర్ణయం కాబట్టే..నేడు అసెంబ్లీలో జీఎస్టీ సంస్కరణలపై ప్రభుత్వం వివరణాత్మక చర్చ చేపట్టిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో షేక్ మహమ్మద్ హుస్సేన్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక కార్యదర్శులు పఠాన్ సమాధ్ ఖాన్, మద్దుమలా రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, పిల్లి లెనిన్, గెరా రాము, జాషువా, చిన్న, రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులున్నారు.

## పార్టీని బలపర్చడమే మా లక్ష్యం : కిడారి శ్రావణ్

పాలకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలోని పాలకొండ మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల కమిటీ సమావేశంలో మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ అధ్యక్షులు, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ బలపర్చడంలో శ్రమించిన, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే భవిష్యత్తులో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి స్థాయిలోనూ కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తేనే పార్టీపై విశ్వాసం పెరుగుతుందని ఆయన అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, గిరిజన సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ బలపడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. అలాగే మండల కమిటీలు గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి పార్టీకి పంపించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో నియోజక వర్గ పరిశీలకులు శ్రీకాకుళం జిల్లా DCCB చైర్మన్ సూర్యనారాయణ నియోజకవర్గ నాయకులు కర్ణనే అప్పలనాయుడు, మండల అధ్యక్షులు రవినాయుడు టౌన్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ ఇతర కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విజయవాడకి పునర్వైభవం విజయవాడ ఉత్సవ్‌తో రానుంది

**●ఆటోనగరలో ఐలా, ఆటో నగర్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, ఫ్లాష్ మాబ్స్**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పున్వరైభవం విజయవాడ ఉత్సవ్‌తో తిరిగి రానుందని ఆటోనగర్ ఐలా సంస్థ, ఆటోనగర్ అసోసియేషన్స్ నాయకులు అభిప్రాయపడ్డారు. సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆటోనగర్‌లో ఐలా సంస్థ, ఆటోనగర్ అసోసియేషన్స్ నాయకులు భారీ బైక్ ర్యాలీ, ఫ్లాష్ మాబ్స్ కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది కార్మికులు, యువకులు విజయవాడ ఉత్సవ్ క్యాపులు, టీ షర్ట్‌లు ధరించి బైక్‌పై సందడి చేశారు. ఆటోనగర్ బస్ టెర్మినల్ దగ్గర గల వంద అడుగుల రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ డిస్ పోజల్ రోడ్డు, టైర్ మార్కెట్ రోడ్డు, పంటకాలవ రోడ్డు, సాయి హెటల్ సెంటర్‌ల మీదుగా ఆటోనగర్ మొత్తం సాగింది. ప్రతి సెంటర్ యువకులు ఫ్లాష్ మాబ్ నిర్వహించి సందడి చేశారు. నగరవాసులు విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఐలా, ఆటోనగర్ అసోసియేషన్ నాయకుడు కోరారు. విజయవాడ సంస్కృతి, కళలు, సంప్రదాయాలు ఉట్టిపటేలా విజయవాడ ఉత్సవ్‌ను సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తుందన్నారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే విజయవాడ ఉత్సవ్‌ను జయపద్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, ఆటోనగర్ ఎలక్ట్రికల్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలామ్, అసోసియేషన్ సభ్యులు గొల్లపూడి నాగేశ్వరరావు, జాస్తి సురేష్, కొడూరు ఆంజనేయులు, అబ్దుల్ మతిన్, వేముల దుర్గరావు, పామర్తి కిషోర్, దండమూడి సుబ్బారావు, ప్రేమచంద్‌లతో పాటు నగర వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అస్వస్థతతో గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్న బాధితులు



గుంటూరు (చైతన్యరథం): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అస్వస్థతతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం 32 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. వారిలో ఎక్కువ మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. వైద్యులు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. అయితే, బాధితులకు డయేరియా లక్షణాలు లేవని వైద్యులు తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి బాధితులను పరామర్శించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ కూడా బాధితులను కలిశారు. కృష్ణానది నుంచి దురద నీరు వస్తున్నందున, కాచి చల్లారిన నీటిని మాత్రమే తాగమని గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ సూచించారు. గుంటూరులో 13 ప్రాంతాల నుంచి ఈ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఇంటింటి సర్వే నిర్వహించాలని వైద్యశాఖకు కార్పొరేషన్ కమిషనర్ ఆదేశించారు. వైసీపీ నేతలు కూడా ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

అరకువ్యాలీ (చైతన్యరథం): డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయితీ గుంటసీమ నుండి తాడా వరకు 2 కోట్ల 90 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన అరకు వ్యాలీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాడ కష్టాలు తీరుతాయని కూటమి ప్రభుత్వం ద్వారానే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం చేయని అభివృద్ధి నేడు కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. గిరిజన ప్రజల కష్టాలను చూసి అడవి తల్లి బాట కార్యక్రమంతో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తుందని గతంలో గిరిజన ప్రాంతంలో కొన్ని రోడ్లకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుందని, కానీ నేడు రోడ్లు లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోరిబోరి లక్ష్మీ మండల అధ్యక్షులు కిల్లో ఆనందరావు, స్థానిక సర్పంచ్ గుమ్మ నాగేష్, మాజీ మండల అధ్యక్షులు సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ సుబ్బారావు, మాజీ ఎంపీపీ దన్నేరావు, టీఎన్‌టీయూసీ పార్లమెంట్ అధ్యక్షులు మండ్య గురుస్వామి, మాజీ సర్పంచ్ గేన్ను, ఎంపీటీసీ మండ్యగురు సింహాద్రి, గ్రామ కమిటీ అధ్యక్షులు జక్కయ్య నన్నారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కొర్ర నాగరాజు పాల్గొన్నారు.

# రెండు మండలాలను విజయవాడలో కలపండి

**● అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): తాగునీరు, చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వానికి కోరారు. గురువారం ప్రారంభమైన రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో యార్లగడ్డ పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రకాశం బ్యారేజీకి కూతవేటు దూరంలో ఉన్న గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలంలో ఉన్న తొమ్మిది గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ తొమ్మిది గ్రామాల్లోని నీటిలో టీడీఎస్ (టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్) 2 వేల నుండి 3 వేల వరకు ఉందని ఈ నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించడం సురక్షితం కాదన్నారు. ఈ గ్రామాలకు తాగునీటి అందించేందుకు విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో రూ.2500 కోట్లతో చేపట్టిన పథకం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కరెన్సీనగర్ వరకు ఉన్న తాగునీటి పైపులైనును ముందుకు పొడిగిస్తే ఈ గ్రామాల ప్రజలకు తక్కువ ఖర్చుతో కృష్ణానది నీటిని అందించవచ్చని యార్లగడ్డ సూచించారు. విజయవాడ నగర ప్రజలతో సమానంగా పన్నులు చెల్లిస్తూ సరైన వసతులు లేక ఈ తొమ్మిది గ్రామాల్లోని ప్రజలు ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించాల్సి వస్తుందని ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా చెత్త సమస్య రోజురోజుకీ తీవ్ర రూపం దాలుస్తుందని దీని పరిష్కారం కోసం గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాలను, గన్నవరం మండలాన్ని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని శాసనసభ ద్వారా సంబంధిత మంత్రికి యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. ఏళ్ళ తరబడి ఒకే చోట పనిచేస్తున్న పిఏసిఎస్ కార్యదర్శులను బదిలీ చేయాలని గత అసెంబ్లీ సమావేశాల్లో కోరితే ఇంతవరకు స్పందించలేదని వీరిని బదిలీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా లేదా అని సూటిగా ప్రశ్నించారు. విజయడెయిరీ బాపులపాడు మండలంలో నిర్మించిన కామధేను ప్లాంట్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేసి విచారణ కోరితే విచారణ జరిపిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# జల సంరక్షణ ప్రజలందరి సామాజిక భాధ్యత

**● ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవంలో వెల్లడించిన రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు**



విజయవాడ (చైతన్యరథం): మనం ఈరోజున నీటిని వృధా చేస్తే... భవిష్యత్ తరాల కళ్ళల్లో నీటిని చూడవలసి వస్తుందని సాగు నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు అన్నారు. ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య కార్యాలయం నుంచి సమాజంలో నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2003 నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఇదే రోజున ప్రపంచంలో ఉన్న సమాజంలోని ప్రజలందరూ నదులు, వాగులు, చెరువులు, వంకలు తదితర నీటి వ్యవస్థలను పర్యవేక్షిస్తూ నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజలు అందరు నీరు అనేది సామజిక ఆస్తిగా భావించాలని ప్రపంచంలో ఎక్కడైనా అందుబాటులో వున్న నీటిలో 97 శాతం సముద్ర జలాలుగా ఉప్పుతో నిండి ఉంటుందని ఒక్క శాతం అంటార్కిటికా, హిమాలయాల వంటి మంచు వ్యవస్థలలో ఉంటుందని కేవలం రెండు శాతం మాత్రమే మానవుల వ్యక్తి గత అవసరానికి, వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి అందుబాటులో ఉంటుందని, అందుబాటులో ఉన్న నీటిలో 70 శాతం వ్యవసాయానికి 22 శాతం పరిశ్రమలకు 8 శాతం వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నామని తెలిపారు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భారతదేశంలో మొట్టమొదటి సారిగా "నీరు-ప్రగతి" కార్యక్రమాన్ని చేపట్టి నవ్యాంధ్రలోని 665 మండలాల్లో గ్రామాల వారీగా, మండలాల వారీగా, జిల్లాల వారీగా నీటి లభ్యత అవసరం, మిగులు, కొరత తదితర విషయాల మీద సమగ్ర సర్వేచేసి పుస్తక రూపంలో నీటి సంఘాల అధ్యక్షులకు, రైతులకు ఇవ్వటం జరిగిందన్నారు. అప్పటి సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా నీటి అవసరం 2750 టీఎంసీలు అవసరం ఉండగా పైనుంచి వచ్చే నదులు, భూగర్భం, చెరువులలో 2235 టీఎంసీలు అందుబాటులో ఉండి, 515 టీఎంసీలు కొరత ఉందని తేలిందని, దీనిని అధికమించడానికి నీరు ప్రగతిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పదముడు జిల్లాలో నీటి సంరక్షణ అవగాహనా సదస్సులు నిర్వహించి 2015 నుంచి 2019 వరకూ చిన్న నీటిపారుదల, గ్రామీణ అభివృద్ధి, అటవీశాఖల నుంచి 18,000 కోట్లు వెచ్చించి చెరువుల పూడికతీత, పంటకుంటల నిర్మాణం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, కాల్వల పూడికతీత, గొలుసుకట్టు చెరువుల నిర్మాణం తదితర జల సంరక్షణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి కారణంగా 90 టీఎంసీలు భూగర్భ జలాలుగా మార్పబడి 6.75 లక్షల ఎకరాల ఆయకట్టు అదనంగా సాగులోకి వచ్చిందని ఆళ్ళ వివరించారు.

# సంక్రాంతి నాటికి అందుబాటులోకి వెస్ట్ బైపాస్

**●ప్లానింగ్ లేక గుంటూరు - విజయవాడ వెళ్లేందుకు ఇబ్బందులు... బైపాస్ పనులు పరిశీలించిన కేంద్రమంత్రి పెమ్మసాని**

**●రూ.2 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రణాళికలు**



గుంటూరు (చైతన్యరథం): "విజయవాడ వెస్ట్ బైపాస్ వంతెనను సంక్రాంతి నాటికి అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అయితే వైసీపీ ప్రభుత్వం అవలంబించిన ప్లానింగ్ లేని ప్రణాళికల వల్ల గుంటూరు టూ విజయవాడ వెళ్ళే ప్రయాణికులకు కొంత ప్రయాణ దూరం పెరుగుతుంది. స్థానికులకు ఇబ్బంది లేకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం." అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. గుంటూరు నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్, విశాఖపట్నం కనెక్టివిటీకి ఉపయోగపడే వెస్ట్ బైపాస్‌ను పెమ్మసాని ఎన్‌హెచ్ఎఐ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... "నిర్మాణాలు, పెండింగ్ పనులు, అండర్ పాస్ వర్కులు తదితర అంశాలను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. కాగా గుంటూరు విజయవాడ మీదుగా వెళ్ళే ప్రయాణికులకు హాయ్ ల్యాండ్ సమీపంలోని అండర్ పాస్ నుంచి యూ టర్న్ తీసుకుని జాతీయ రహదారి గుండా వెళ్లాల్సి ఉంటుంది. సాధారణంగా 2014 - 19 సమయంలో టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణాన్ని వైసీపీ వచ్చాక పూర్తిగా గాడి తప్పింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధమవుతున్న ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా ఈ సమస్యకు పరిష్కారం అందించబోతున్నాం. అలాగే ఈ అండర్ పాస్ వద్దగల స్థానికులకు ప్రయాణ రాకపోకలకు ఇబ్బంది లేకుండా రూ.2 కోట్ల నిధులతో ఫుట్ బ్రిడ్జ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించాం. కాగా డిసెంబర్ చివరికి నిర్మాణం పూర్తి చేసి సంక్రాంతి కల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం పనులన్నీ సజావుగా సాగుతున్నాయి." అని పెమ్మసాని ఈ సందర్భంగా వివరించారు. ఈ పర్యటనలో ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో కృషి చేయాలి



విజయవాడ (చైతన్యరథం): క్రిబ్కో (క్రిషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్) నూతన ఛైర్మన్‌గా ఎంపికైన తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి గురువారం గురునానక్ కాలనీలో విజయవాడ పార్లమెంట్ కార్యాలయర్‌లో ఎంపి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వల్లభనేని సుధాకర్ చౌదరికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపి పుష్పం గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. సహకార రంగంలో రెండవ అతి పెద్ద ఎరువుల కంపెనీ అయిన క్రిషక్ భారతి కో - ఆపరేటివ్ లిమిటెడ్ చైర్మన్‌గా ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతం చేయడంలో కృషి చేయాలని సుధాకర్ చౌదరికి ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. ఈ కార్యక్రమం విజయ డైరీ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**గొల్లపూడి ఎగ్జిబిషన్‌కి జరిగిన భూమి పూజ**

సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్‌కి భూమి పూజ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు పాల్గొని ఎలాంటి విఘ్నాలు లేకుండా జయప్రదం కావాలని ప్రార్థించారు. దాదాపు పన్నెండు సంవత్సరాల తర్వాత విజయవాడలో ఎంపీ కేశినేని శివనాథ్ చొరవతో ఎగ్జిబిషన్ మొదలు కానుండటం ఎంతో ఆనందంగా వుందని నేతలు అభిప్రాయపడ్డారు. అమ్మవారి ఆశీస్సులతో విజయవాడ ఉత్సవ్ విజయవంతంగా జరుగుతుందన్నారు. ప్రజలు విజయవాడ ఉత్సవ్ కోసం, యంగ్ జనరేషన్‌తో పాటు చిన్నారులు ఎగ్జిబిషన్ ఫీలింగ్ ఎక్స్పీరియన్స్ చేయటానికి ఆసక్తి ఎదురు చూస్తున్నారన్నారని పేర్కొన్నారు.

# గుడివాడ పురపాలక సంఘం లోగో ఆవిష్కరణ

**●మున్సిపల్ యంత్రాంగాన్ని అభినందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ మున్సిపల్ యంత్రాంగం రూపొందించిన పురపాలక సంఘ లోగోను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. 1937లో ఆవిర్భవించిన గుడివాడకు లోగోను రూపొందించుకోవడం సంతోషకరమని ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో గురువారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము... మున్సిపల్ అధికారులతో కలిసి పురపాలక సంఘ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోగోను ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే రాముకు లోగో ప్రత్యేకతలను కమిషనర్ సింహాద్రి మనోహర్ మరియు అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ... 1937లో ఆవిర్భవించిన పురాతనమైన గుడివాడ పురపాలక సంఘానికి నేటి వరకు లోగో లేకపోవడం విచారకరమన్నారు. పురపాలక సంఘాన్ని అభివృద్ధి చేద్దాం అన్న ఆశయంతో అనేక ప్రత్యేకతలతో అత్యద్భుతంగా లోగో రూపకల్పన జరిగినట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. అన్నదాతలకు ప్రతిరూపంగా లోగో అన్ని వైపులా గ్రీన్ కలర్ రూపొందించామని.... గుడులకు ప్రసిద్ధి గాంచడంతో లోగోలో దేవాలయ ప్రతిరూపాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా గుడివాడ సూచికగా లోగో మధ్యలో జి ఆకారం, అభివృద్ధికి చిహ్నంగా రేసింగ్ గ్రోత్‌లో భాగంగా లోగోలో సూర్యకిరణాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. అభివృద్ధి చెందుతున్న గుడివాడకు లోగో ఆవశ్యకత ఉందని... ఇన్ని ప్రత్యేకతలతో లోగో రూపొందించిన పురపాలక సంఘ యంత్రాంగాన్ని ఎమ్మెల్యే రాము అభినందించారు. 8 దశాబ్దాలు దాటిన గుడివాడ పురపాలక సంఘంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండడం విచారకరమని గుడివాడ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ గుడివాడలో పనిచేయడానికి మంచి ఉద్యోగులు వచ్చే పరిస్థితి ఉండేది కాదని.... అలాంటి స్థితి నుండి నేడు సమర్థవంతమైన అధికారులను గుడివాడ తీసుకొచ్చామని.... పట్టణ అభివృద్ధికి వారు ఎంతో కష్టపడుతున్నారని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గతానికి భిన్నంగా అనేక ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విజయవంతమయ్యామని... ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించడం... అవసరమైన చోట్ల రోడ్లు వేయడం.... వర్షాకాల సీజన్లో దోమలు లేకుండా నిర్మూలించడం తదితర విషయాల్లో తాము తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చినట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. పట్టణ సుందరీకరణ దిశగా అడుగులు వేస్తున్నామని... ఇప్పటికే ప్రణాళికల రూపొందించి ఆచరణలో పెట్టామని, సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు.

# అతివల ఆరోగ్యంతోనే సమాజానికి సౌభాగ్యం

### ఆరోగ్య శిబిరంలో దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, (చైతన్యరథం): దర్శి మండలం, చందలూరు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో "స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని దర్శి టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, కుటుంబ బలోపేతమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఈ జాతీయ పథకం, అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశమంతటా మహిళల కోసం ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ప్రారంభించారన్నారు. ఈ అభియాన్‌లో గుండె జబ్బులు, మధుమేహం, నోరు, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణుల కౌన్సిలింగ్, పోషకాహార అవగాహన, బాలికల్లో హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్తహీనత నివారణ, పిల్లల సికిల్ సెల్ అనీమియా పరీక్షలు, టీకాలు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ, రక్తదాన శిబిరాలు, అవగాహన తదతర విస్తృత సేవలు అందిస్తామన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను వినియోగించుకోవాలని దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి డాక్టర్ లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందలూరు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు శ్రీవాణి, లక్ష్మీ పూజిత, శ్రీనివాసులు, బ్లెస్సీ, సురేఖ, సిబ్బంది, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు మరెళ్ల వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పుప్పాల పాపారావు, చందలూరు గ్రామంలోని టీడీపీ నాయకులు, మహిళలు, నియోజకవర్గంలోని కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు యువనేత సోమిరెడ్డి పరామర్శ

### ఇంటింటికీ వెళ్ళి, తానున్నానని భరోసా ఇచ్చిన రాజగోపాల్‌రెడ్డి

సర్వేపల్లి, (చైతన్యరథం): సర్వేపల్లిలో పలువురు టీడీపీ నాయకుడు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న చింతా సుమన్‌ను తోటపల్లి గూడూరు మండలంలోని వెంకన్నపాళెంలో పరామర్శించారు. పొదలకూరు మండలం ఊచపల్లిలో మలిశెట్టి మనోహర్ తల్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పొదలకూరు పట్టణంలో మైనార్టీ సెల్ నాయకులు షేక్ జమీర్ కోడలు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను రాజగోపాలరెడ్డి పరామర్శించారు.

# తానున్నానని భరోసా ఇచ్చిన సీఎం చంద్రబాబు



నెల్లూరు, చైతన్యరథం): పెద్ద కొడుకుగా, పెద్దన్నగా, పేదల పాలిట పెన్నిధిగా అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆపన్నహస్తం అందిస్తూ ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. వందలాదిమంది బాధితులకు అండగా నిలుస్తున్న సీఎంకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో ఒకేరోజు 102 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.1 కోటి రూపాయలను ఆమె అందజేశారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని వీపీఆర్ నివాసంలో చెక్కులను అర్హులకు పంపిణీ చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో 99 మంది లబ్ధిదారులకు, అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలో 3 అర్హులకు ఎమ్మెల్యే ప్రశాంతి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 15 నెలల వ్యవధిలో నియోజకవర్గంలో 15 విడతలుగా 362 కుటుంబాలకు 4 కోట్ల 4 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కోవూరు గ్రామానికి చెందిన పెనుబల్లి శ్రీధర్ రెడ్డి అనే కార్యకర్త చనిపోయి మూడు సంవత్సరాలు అయినా ఆ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు చేశారన్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం వాసి మన్నెం వెంకటేశ్వర్లు నెల్లూరు అపోలో బ్రెయిన్ స్ట్రోక్ తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రశాంతి రూ.8 లక్షలు సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్ పర్సన్ దొడ్ల విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పార్టీ కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ అశోక్ రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, బుచ్చి టీడీపీ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు, ఇందుకూరు పేట మండల టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, నాయకులు రావెళ్ల వీరేంద్ర నాయుడు, కమలాకర్ రెడ్డి, జెట్టి మదన్ మోహన్ రెడ్డి గుడి హరికుమార్ రెడ్డి, చప్పిడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# జైల్లో దస్తగిరికి బెదిరింపులపై పోలీసుల విచారణ




కడప, (చైతన్యరథం): మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్యకేసులో అప్రూవర్గా మారిన దస్తగిరిని కడప జైల్లో బెదిరించిన ఘటనపై కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మరోసారి విచారణ చేపట్టారు. హత్య కేసు: నిందితులకు కడప జైల్లో సహకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాశ్బాటు, అభియోగాలు ఎదుర్కొంటున్న వైద్యురాలు పుష్పలత, ప్రవీణ్ను ఎస్పీ విచారించారు. రెండు వారాల క్రితం ఓ రోజంతా ఇప్పటికే వీరిని విచారించారు. 2023 నవంబర్లో జైలు అధికారుల అండతో తనను చైతన్య రెడ్డి బెదిరించినట్లు దస్తగిరి ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై లోతుగా విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నలుగురు సభ్యుల బృందంతో కమిటీ వేసింది.

# వైద్య కళాశాలలపై వైసీపీ రౌడీల పిచ్చి ప్రేలాపనలు

### నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి ఆగ్రహం

నంద్యాల, (చైతన్యరథం): రాష్ట్రంలో పనిపాటా లేని వైకాపా నాయకులు, కొందరు రౌడీలు వైద్య కళాశాలలపై అసత్య ప్రచారాలు చేస్తుంటే వైద్యురాలిగా తాను ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన అవసరం ఉందని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాల సర్వజన ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఆడబిడ్డల ఆరోగ్యం పదిలం కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం, దేశం సుభిక్షంకి ఉంటుందన్నారు. మహిళా చైతన్యంతోనే దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అది జీర్ణించుకోలేని వైకాపా నాయకులు మెడికల్ కళాశాలలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం రూ. 85000 కోట్లు మంజూరు చేసిందన్నారు. జగన్ పాలనలో రూ.1400 కోట్లు మాత్రమే ఖర్చు చేసి అన్ని పనులు అసంపూర్తిగా మిగిల్చిందన్నారు. 2023 లో 108 జీవోలో ఏముందో వైసీపీ నాయకులు చెప్పాలని డిమాండు చేశారు. అక్టోబరు 2వ తేదీ వరకు దేశంలో లక్ష వైద్య శిబిరాలు నిర్వహించి ఆడపడుచులు ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్యాధికారి వెంకటరమణ, కేసీపీ హెడ్ డాక్టర్ లలిత మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ రెడ్డి, కౌన్సిలర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.




# చంద్రబాబు హయాంలోనే వైద్యవిద్య పురోగతి



అమరావతి, (చైతన్యరథం): ఆంధ్ర రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు పైసా కూడ ఖర్చు చేయని జగన్ నేడు మెడికల్ కాలేజీల సందర్శన చేస్తాననటం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ వైసిపిపై తీవ్రంగా మండిపడ్డారు. అమరావతిలో గురువారం పాతర్ల విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నడిచే 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 50శాతం ఎంబీబీఎస్ సీట్లను ప్రైవేటీకరించిన దౌర్భాగ్యం జగన్ ది అయితే. 26 మెడికల్ కాలేజీలు స్థాపించిన ఘనత చంద్రబాబుది అన్నారు. ఎన్టీఆర్, నిమ్స్, స్విమ్స్, ఎయిమ్స్ బర్ట్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ, జీనోమ్ వ్యాలీ, మెడిటెక్ సిటీ స్థాపించింది టీడీపీ నేనని గుర్తుచేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రాష్ట్ర నిధుల నుండి పైసా కూడా ఖర్చు పెట్టని జగన్ 5 ఏళ్ల జగన్ పాలనలో మెడికల్ కాలేజీల నిర్మాణాలకు కాంట్రాక్టు చెల్లించినది రూ.1451 కోట్లు ఈ రూ.1451 కోట్లలలో కేంద్రం ఇచ్చిన నిధులు 975 పీజీ మెడికల్ సీట్ల నిధులు మళ్లింపు రూ.476 కోట్లు 1451 మెడికల్ కాలేజీల నిర్మాణాలకు అవసరమయ్యే నిధుల మొత్తం రూ.8.480కోట్లు పీజీ మెడికల్ సీట్లకు అవసరమైన వసతుల నిర్మాణాలకు కేంద్రం ఇచ్చిన నిధులు రూ.700 కోట్లు దారి మళ్లింపు ఈ రూ.700 కోట్లు పేజీ మెడికల్ సీట్ల కొరకు ఖర్చు చేయకుండా స్పెషలిస్టు డాక్టర్లకు అన్యాయం చేశారన్నారు. జగన్ సీఎం కాకముందు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ ఎన్ఆర్ఐ కోటా లేదా? అని ఆయన ప్రశ్నించారు. మెడికల్ సీట్లు పొందిన విద్యార్థి చంద్రబాబు ప్రభుత్వంలో 15 వేల రూపాయల ఫీజు చెల్లిస్తే సరిపోయేదన్నారు. జగన్ జీవో 107108133 విడుదల చేసి వీటి ద్వారా 30 శాతం సెల్ఫ్ ఫైనాన్స్ 15 శాతం ఎన్నారై కోటగా రిజర్వు చేశారని ఆయన విమర్శించారు. సెల్ఫ్ ఫైనాన్స్ ఎంబిబిఎస్ సీటుకు 12 లక్షలు ఎన్ఆర్ఐ సీటుకు 20 లక్షలు ఫీజు నిర్ణయించారని, అంటే కన్వీనర్ కోటాలో ఉన్న 50శాతం ఎంబిబిఎస్ సీట్లను ప్రైవేటుకరించింది జగనే అని అన్నారు. పాడేరు కాలేజీకి నిధులు పూర్తిగా కేంద్రం ఇస్తున్నందున కూటమి ప్రభుత్వ అండర్ టేకింగ్‌తో దానికి అనుమతిచ్చారని, 150 సీట్లకు బదులుగా 50 సీట్లకే అనుమతి ఇచ్చారని ఆయన తెలిపారు.



# కడపలో ఇస్తమాకు సాయమందిస్తా

### తనను కలిసిన కడప జిల్లా మైనారిటీ నాయకులకు సీఎం చంద్రబాబు నాయుడు హామీ

అమరావతి, (చైతన్యరథం): 2026లో కడప నగరంలో జరగనున్న ఇస్తమాకు ప్రభుత్వం తరపున తమ సహకారం అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. అమరావతిలోని అయన కార్యాలయంలో ఇస్తమా కోసం అనుకూలమైన స్థలాన్ని అవసరమైన ఏర్పాట్లను కల్పించడానికి సహకరించాలని ముస్లిం మత పెద్దలు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి కార్యక్రమం గురించి వివరించారు. కడపలో జరగనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలువైపుల నుండి 5 లక్షలకు పైగా ముస్లింలు పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మైనార్టీ శాఖ మంత్రి ఫారుక్, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష, ఎమ్మెల్సీ షరీఫ్, మత పెద్దలు ఉన్నారు.

# సేవా దృక్పథంతో ఆర్డీటీని ఆదుకోండి


### ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతికి కృషి చేయాలని అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి విజ్ఞప్తి



పుట్టపర్తి, (చైతన్యరథం): క్షామపీడిత అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆర్డీటీ సేవలు పరిణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపి ఆదుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆర్డీటీ అంశాన్ని ప్రస్తావించారు. విద్య, వైద్య, ఆరోగ్య రంగాల్లో ముఖ్యంగా మహిళాభివృద్ధి కోసం ఎన్నో సేవలు అందిస్తోందని ఈ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 3891 గ్రామాల్లో సుమారు 4. 50 లక్షల కుటుంబాలకు వివిధ సేవలు అందిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో పేదలకు ఇళ్ల నిర్మాణం,పేద విద్యార్థుల కోసం పాఠశాల భవనాల నిర్మాణం పేద విద్యార్థులకు విద్యాభివృద్ధి గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు చెరువులు, కుంటలు, చెక్ డ్యాంల నిర్మాణం, రైతులకు పండతోటల పెంపకం, తుంపర సేద్యంతో పాటు బాగా వెనుకబడిన గ్రామాలకు రహదారుల నిర్మాణాన్ని చేపట్టిన సేవలను గుర్తు చేశారు. సంస్థ నిర్వహిస్తున్న ఆర్డీటీ ఆసుపత్రిలో సుమారు 8.50 లక్షల అవుట్ పేషెంట్లకు సుమారు 60 వేల మంది ఇన్ పేషెంట్లకు నిత్యం వైద్య సేవలు, అతి తక్కువ ధరకే మందులు కూడా అందిస్తోందని వివరించారు. క్రీడారంగంలో యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణతో రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. అలాంటి ఆర్డీటీ సంస్థకు సాంకేతిక కారణాలతో ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకుండా కేంద్రప్రభుత్వం ఆంక్షలు విధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరవు సీమకు ఆర్డీటీ అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని కోరారు.

# జగన్‌తో జరిగిందేమీ లేదు

### పులివెందుల టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి విమర్శ



పులివెందుల, (చైతన్యరథం): పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి సమక్షంలో నగరిగుట్టకు చెందిన సాయికుమార్, శివ కుమార్, సంతోష్ పులివెందుల మున్సిపాలిటీ టీడీపీ నాయకుడు రాష్ట్ర హజ్ హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాష (కిరికిరి బాష), నల్లాగారి భాస్కర్ రెడ్డి, మద్దరు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో శివకుమార్, సాయి కుమార్, సంతోష్‌తో సహ పలు కుటుంబాలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి బీటెక్ రవి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ జగన్ పాలనలో పులివెందుల వెనకబడి పోయిందన్నారు. ప్రజలకు అభివృద్ధి, ఉపాధి, గౌరవం ఏమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి కలిసి ముందుకు వెళ న్నాయన్నారు. ప్రతి ఇంటికీ వెలుగులు నింపేది, ప్రతి యువకుడికి భవిష్యత్తు కల్పించేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగన్ ఇచ్చిన వాగ్దానాలు అన్నీ మోసమేనన్నారు. అభివృద్ధి అనే మాటే లేకుండా పులివెందుల ప్రజలు కష్టాల్లో పడ్డారన్నారు. అందుకే తాము తెలుగుదేశం పార్టీలో చేరామన్నారు. ఇప్పుడు బీటెక్ రవి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలతో పులివెందులని ముందుకు తీసుకెళ్తోందని అందుకే టీడీపీలో చేరామని చెప్పారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ భద్రత

### తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు వెల్లడి

తిరుమల, (చైతన్యరథం): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. గత బ్రహ్మోత్సవాల్లో లోపాలను గుర్తించి ప్రత్యేకమైన భద్రతా చర్యలు చేపటామని చెప్పారు. భద్రత కోసం తిరుమలలో 3 వేల మంది. తిరుపతిలో వెయ్యి మంది పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి దర్శనం కోసం వేది ఉండే భక్తులకు నిరంతరం అన్నప్రసాదాలు, తాగు నీరు వంటివి పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గరుడ సేవ రోజు తిరుమల కనుమ రహదారుల్లో ద్విచక్రవాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామని, తిరుమల వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా రావాలని కోరారు. తిరుపతిలో 5 ప్రాంతాలలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 4 వేల సీసీ కెమెరాల ద్వారా బ్రహ్మోత్సవాలను పర్యవేక్షిస్తామన్నారు. 1500 మంది విజిలెన్స్ సిబ్బంది బ్రహ్మోత్సవాల విధుల్లో పాల్గొననున్నట్లు టీటీడీ ముఖ్య భద్రతా అధికారి మురళీకృష్ణ తెలిపారు. విజిలెన్స్ తో పాటు అనుబంధ విభాగాలైన అక్టోపస్, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు నిరంతరం భక్తుల భద్రతను పర్యవేక్షిస్తాయన్నారు. నిఘా వ్యవస్థలో ఎలాంటి లోపం లేకుండా పని చేస్తామన్నారు.



# నాలుగురోజులు వర్షాలు

### ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

అమరావతి, (చైతన్యరథం): రానున్న నాలుగు రోజులు దక్షిణకోస్తా, రాయలసీమలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 5 గంటల నాటికి తిరుపతి జిల్లా మల్లంలో 70మిమీ, కాకినాడ జిల్లా ఇంజరంలో 58మిమీ, తిరుపతి జిల్లా కోటలో 52.7మిమీ, ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 52.2మిమీ, యర్రగొండపాలెంలో 49.7మిమీ, చిత్తూరు జిల్లా దామోదర మహారాజపురంలో 49మిమీ, కోనసీమ జిల్లా ఈతకోటలో 47మిమీ వర్షపాతం నమోదయిందన్నారు.

# కడపలో కుంభవృష్టి

### విరిగిపడిన స్తంభాలు, నిలిచిపోయిన రాకపోకలు

కడప, (చైతన్యరథం): వైఎస్సార్ కడప జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాజీపేట-కమలాపురం మార్గంలో రహదారిపై భారీగా వాన నీరు వేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కడప శివారులోని పాతిమా కళాశాల సమీపంలో లోలెవెల్ వంతెన పై నుంచి వరద ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వల్లూరు మండలం ప్రెడిక్వ నుంచి కడపకు వెళ్లే మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గోపులాపురం గ్రామం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కిందకి వరద చేరింది.





కుదుటపడిన నేపాల్..

# శాంతిస్థాపనకు సహకరిస్తాం

### హామీ ఇచ్చిన ప్రధాని మోదీ

సోషల్ మీడియాపై నిషేధం. అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీతో ఆయన ఫోన్లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు.

సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై, అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్–జీ ఎంపిక వేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పాడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 3న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

# ఆన్‌లైన్లో ఓట్లను తొలగించడం అసాధ్యం

### - రాహుల్ విమర్శలకు ఈసీ ఖండన

సాఫ్ట్వేర్ వినియోగించి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు... ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారు" అని ఈసీ వెల్లడించింది.



#### భాజపా విమర్శలు..

రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. "రాహులకు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను? అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్ళ అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..?

వాళ్ళు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారు" అని దిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్ నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించాని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 30 ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయనలో అసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టు మందలింపులు ఆయనకు పరిపాటిగా మారిపోయాయని అన్నారు.

## ఓటు తీసేయమని ఎవరైనా అడగొచ్చు

### అంతమాత్రాన విచారణ లేకుండా తొలగింపు జరగదు



సాఫ్ట్వేర్ సాయంతో అనేక మంది కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించిన విషయం తెలిసిందే. కర్ణాటకలో కేవలం ఒక్క ఆలంద్ నియోజకవర్గంలోనే వేలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ, ఆన్‌లైన్‌లో ఏ ఒక్క ఓటును తొలగించలేరని స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం లేకుండా ఓటు తీసివేయడం కుదరదని పేర్కొంది. ఈ నేపథ్యంలో అసలు ఓటు తొలగింపు ప్రక్రియ ఎలా ఉంటుందని విషయం పరిశీలిస్తే. (ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలన్న లేదా జాబితాలో ఎవరిపైనా అభ్యంతరం ఉన్నా... ఫారం 7తో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా ఓటరు తన నియోజకవర్గం మారినా ఇదే ఫారంతో దరఖాస్తు చేసుకోవాలి. నియోజకవర్గం పేరు, ఎపిక్ నంబరు, తొలగింపునకు కారణాన్ని తెలియజేయడంతో పాటు దరఖాస్తుదారుని వివరాలు, సంతకం కూడా అవసరం. ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

#### క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఇలా వచ్చిన దరఖాస్తులను ఈఆర్ క్షుణ్ణంగా పరిశీలించి ఓటరుకు వ్యక్తిగతంగా, రిజిస్టరు పోస్టు ద్వారా తెలియజేస్తారు. ఒక్కసారి ఓటరు ఇంటికి నోటీసులు అంటిస్తారు. ఓటరు ఆ అడ్రస్‌లోనే ఉన్నాడా? లేదా మరణించాడా! నకిలీ నమోదా? అన్న విషయాన్ని బీఎల్‌వో క్షేత్రస్థాయికి వెళ్లి ధృవీకరించుకొని ఈఆర్‌వోకు నివేదిస్తారు. తొలగింపు కోసం ఇతరులు దరఖాస్తు చేస్తే.. వారితోపాటు ఓటరు అభిప్రాయాన్ని తీసుకుంటారు.

సంబంధిత దస్త్రాలు, వ్యక్తిగతంగా హాజరుకావడం. స్టేట్మెంట్ రికార్డు వంటి ప్రక్రియ తర్వాత పేరును తొలగింపు లేదా దరఖాస్తు తిరస్కరణపై నిర్ణయం తీసుకుంటారు. దీనిపై దరఖాస్తుదారు అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గం. మారినప్పుడు, సంబంధిత అడ్రస్‌లో నివసించనప్పుడు, జాబితాలో రెండుసార్లు ఉన్నప్పుడు, వ్యక్తి చనిపోవడం లేదా భారత పౌరుడు కాని పక్షంలో మాత్రమే ఓటరును తొలగించే అవకాశం ఉంటుంది.

#### ఎవరైనా దరఖాస్తు చేయవచ్చా?

తమ నియోజకవర్గంలో ఉన్న ఓటరు పేరు తొలగించాలని ఎవరైనా దరఖాస్తు (ఫారం 7) చేయవచ్చు. అయితే, దరఖాస్తు చేసినంత మాత్రానా ఓటు తొలగిపోదు ఓటరుకు నోటీసు ఇవ్వడం, క్షేత్రస్థాయి దర్యాప్తు తర్వాతే ఈఆర్వో నిర్ణయం తీసుకుంటారు. ఓటరు పేరును నేరుగా తొలగించడం చట్టవిరుద్ధం. తప్పుడు దరఖాస్తు చేసినా చట్టప్రకారం నేరమే.

### శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో

# బంగారు తాపడాల తారుమారు

### కోప్పడిన కేరళ కోర్టు - నిగ్గుతేల్చాలని విజిలెన్స్‌కు ఆదేశం

కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా అందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూతపూసిన రాగి తాపడాలను 2018లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చైన్నై లోని ఓ సంస్థకు అప్పగించారు. 2018లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక, ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది.

ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్టుండి తాపడాల బరువు 1.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్‌ను



కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో అనేక లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకోవాలని విజిలెన్స్ కమిటీ దర్యాప్తునకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా పూర్తి నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబరు 30వ తేదీకి వాయిదా వేసింది. శబరిమల స్పెషల్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండానే ద్వారపాలక విగ్రహల బంగారు తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు అనుమతులు లేకుండా వాటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించింది. దీనిపై బోర్డు నుంచి వివరణ కోరింది.

# ఉత్తరాఖండ్‌లో విరిగిపడుతున్న కొండ చరియలు



### - తృటిలో ప్రమాదం తప్పిన బీజేపీ ఎంపీ

### - రెడ్ అలెర్ట్ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లో కొండవరియలు విరిగిపడ్డాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న భాజపా ఎంపీ అనిల్ బలూనీ తృటిలో తప్పించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్లో పోస్టు చేయగా... అది వైరల్ అవుతోంది

గతకొన్ని రోజులుగా రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లోని పరిస్థితులను అంచనావేసేందుకు బలూనీ పర్యటన చేపట్టారు. ఆయన ఉన్న ప్రాంతంలో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే ఆయనను అక్కడి నుంచి తీసుకెళ్లారు. కొంతసేపటి తర్వాత బలూనీ తన పర్యటనను కొనసాగించారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో పాటు అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రం చాలా వరకూ దెబ్బతింది. నిన్న సాయంత్రం కూడా అనేక ప్రాంతాల్లో కొండవరియలు పడ్డాయి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు సేవ చేస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ బృందాలను అభినందిస్తున్నా... విపత్తు నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నా" అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. కొండచరియలు విరిగిపడ్డ వీడియోను కూడా ఆయన పంచుకున్నారు..

డెహ్రాడూన్, చమోలిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వారంలో వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా 15 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం రాత్రి చమోలి జిల్లాలో క్లౌడ్ బరస్ట్ సంభవించింది. ఈ ఘటనలో 10 మంది గల్లంతయ్యారు. పలు భవనాలు కుప్పకూలాయి. ఈ నేపథ్యంలోనే డెహ్రాడూన్, చంపావత్, ఉధమ్ సింగ్ నగర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ నెల 20వరకు అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

## భారత్‌పై ట్రంప్ ఆరోపణలు

**డ్రగ్స్ ఉత్పత్తి కేంద్రమంటూ డిటర్మినేషన్ నివేదిక**



భారత్‌సహా 3 దేశాలు అక్రమంగా డ్రగ్స్‌ను ఉత్పత్తి చేస్తున్నాయని, రవాణా స్థావరాలుగా వ్యవహరిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. చైనా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్లు ఈ జాబితాలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇవి అక్రమ డ్రగ్స్‌ను, అందులో వాడే రసాయనాలను ఉత్పత్తి/ రవాణా చేస్తూ అమెరికా ప్రజల భద్రతకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. అమెరికన్ కాంగ్రెస్‌కు సోమవారం సమర్పించిన 'ప్రెసిడెన్షియల్ డిటర్మినేషన్' నివేదికలో ట్రంప్ ఈ ఆరోపణలు చేశారు. భారత్, పాకిస్థాన్, చైనా, అఫ్గానిస్థాన్, ద బహమాస్, బెలీజ్, బొలీవియా, బర్మా, కొలంబియా, కోస్టారికా, ద డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, హైతీ, హొండురస్, జమైకా, లావోస్, మెక్సికో, నికరాగువ, పనామా, పెరూ, వెనెజువెలా దేశాలు ప్రధానంగా డ్రగ్స్‌ను ఉత్పత్తి చేయడంతోపాటు రవాణా చేస్తున్నాయని వివరించారు.

## విలాస విహారానికి రూ.7 కోట్లు

**140 రోజుల టూర్ ప్రకటించిన 'రీజెంట్ సెవెన్ సీస్'**



ప్రపంచంలో విలాసవంతమైన క్రూజ్‌లను నడిపే సంస్థ 'రీజెంట్ సెవెన్ సీస్'. ఇది తాజాగా తన అత్యంత ఖరీదైన క్రూజ్‌లో ప్రయాణానికి సంబంధించిన వివరాలను విడుదల చేసింది. 2027లో ప్రారంభమయ్యే ఈ "వరల్డ్ ఆఫ్ స్పెండర్" క్రూజ్.. ఆరు ఖండాల్లోని 40 దేశాలు, 71 పోర్టుల మీదుగా మొత్తం 140 రోజులు కొనసాగుతుంది. ఈ క్రూజ్‌లో ప్రారంభ టికెట్ ధర రూ.80లక్షలు. ఇక రీజెంట్ సూట్ (అత్యంత విలాసవంతమైన సూట్) ధరను రూ.7.3 కోట్లుగా ప్రకటించారు. 4,000 చదరపు అడుగులున్న ఈ సూట్లో దిగిన వారికి ప్రతి పోర్టులో పర్యటించడానికి ఓ ప్రైవేటు కారు, డ్రైవరును ఏర్పాటు చేస్తారు. అమెరికాలోని మియామీలో మొదలై, తిరిగి న్యూయార్క్‌లో ముగుస్తుంది. లాస్ ఏంజెలిస్, సిడ్నీ, సింగపూర్, మలీబు, ముంబయి నగరాల్లో రాత్రి బస కల్పిస్తారు. ఇందులో 744మంది పర్యాటకులు ప్రయాణిస్తారు. 548 మంది సిబ్బంది ఉంటారు.

## ఎయిర్‌ఫోర్స్ వన్ సమీపంలోకి స్పిరిట్ ఎయిర్‌లైన్స్ విమానం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా యూకే పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో వారు ప్రయాణిస్తున్న ఎయిర్ ఫోర్స్ వన్‌కు అతి సమీపంగా ప్రయాణికుల విమానం దూసుకురావడం కలకలం సృష్టించింది. మంగళవారం ట్రంప్, మెలానియా ప్రయాణిస్తున్న ఎయిర్‌ఫోర్స్ వన్ 'లాంగ్ ఐలాండ్ వద్ద గగనతలంలో ఉన్నప్పుడు స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన మరో విమానం దాని సమీపంలోకి వచ్చింది. న్యూయార్క్ టవర్ కంట్రోలర్ వెంటనే స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారి విమానాన్ని కుడివైపునకు మళ్లించమని హెచ్చరికలు జారీ చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌ను గమనించాలంటూ పదేపదే చెబుతున్నప్పటికీ.. స్పిరిట్ పైలట్లు పట్టించుకోకపోవడంతో అధికారులు వారిపై మండిపడ్డారు. 'శ్రద్ధ వహించండి.. ఐప్యాడ్‌నుంచి బయటికిరండి' అంటూ పైలట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అప్రమత్తమైన పైలట్లు తమ దిశను మార్చుకున్నారు. ఈ సంఘటనపై స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సంస్థ స్పందించింది. 'భద్రతే మా తొలి ప్రాధాన్యం. మా విమానం 1300 బోస్టన్‌కు వెళ్తున్న సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సూచనలు పాటించింది. సురక్షితంగా గమ్యస్థానానికి చేరింది' అని ఓ వార్తా సంస్థతో పేర్కొంది.

## నిద్రపోయిన ఏటీసీ.. సముద్రంమీదే విమానం




సిబ్బంది నిద్రపోవడంతో ప్రయాణికుల విమానం ఒకటి 18 నిమిషాలు సముద్రంపై చక్కర్లు కొట్టాల్సివచ్చింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌నుంచి కోర్సికా ద్వీపానికి బయల్దేరిన ఎయిర్ కోర్సికా ఎయిర్బస్ విమానానికి ఈ పరిస్థితి ఎదురైంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి తర్వాత పారిస్‌నుంచి బయల్దేరిన విమానం.. ఇటలీలోని కోర్సికా రాజధాని అజాక్సియోలోని విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉంది. దాంతో ఆ దిశగా కిందికి దిగుతోంది. కానీ ఎయిర్పోర్ట్ కంట్రోల్ టవర్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అప్పుడు నైట్‌షిఫ్ట్‌లోవున్న ఎయిట్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది నిద్రపోవడమే అందుకు కారణమైంది. రన్‌వేపై ల్యాండింగుకు అనుమతి రాకపోవడంతో పైలట్ విమానాన్ని గాల్లోనే ఉంచాల్సి వచ్చింది. అప్పుడు ఆ విమానం మధ్యధరా సముద్రం మీదుగా ప్రయాణిస్తోంది. క్లియరెన్స్ లేకపోవడంతో 18 నిమిషాలు అది చక్కర్లు కొట్టాల్సి వచ్చింది ఈ విషయాన్ని ఏవియేషన్ అధికారులు ధ్రువీకరించారు. అయితే ఆ సమయంలో ఎయిర్పోర్ట్ ఫైర్ డిపార్ట్మెంట్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వారి ద్వారా ఈ నిద్ర విషయం వెలుగులోకి వచ్చింది. తర్వాత ఏటీసీ అధికారులు విమానం ల్యాండింగుకు సిగ్నల్ ఇవ్వడంతో సురక్షితంగా కిందకు దిగింది. నిద్రపోయిన అధికారి మద్యం తీసుకోలేదని తేలింది. విమానం గంటపాటు ఆలస్యం కావడం కూడా ఈ పరిస్థితికి దారితీసిందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు వెల్లడించారు.

## హలో.. గోల్డ్ ట్రంప్!

**- క్యాపిటల్ భవనం ఎదురుగా 12 అడుగుల విగ్రహం**

**- వడ్డీ రేట్ల కోతతో క్రిప్టో కరెన్సీ పెట్టుబడిదారుల ఏర్పాటు**



అమెరికా ఫెడరల్ రిజర్వు 25 బేసిస్ పాయింట్లమేర వడ్డీ రేట్ల కోత విధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బంగారు విగ్రహాన్ని అమెరికా క్యాపిటల్ భవనం ఎదురుగా ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. 12 అడుగులున్న ఈ విగ్రహం.. ట్రంప్ బిట్ కాయిన్‌ను పట్టుకుని ఉన్నట్టు రూపొందించారు. క్రిప్టో కరెన్సీ పెట్టుబడిదారులు ఈ విగ్రహం ఏర్పాటుకు నిధులు సమకూర్చినట్టు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, ద్రవ్య విధానం, ఆర్థిక మార్కెట్లో ఫెడరల్ ప్రభుత్వ విధానాల గురించి చర్చించుకునేలా చేసేందుకే దీన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు చెప్పినట్టు సమాచారం. ఈ విగ్రహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కొంతమంది దీనిపై సానుకూలంగా స్పందించగా.. మరికొందరు విమర్శలు చేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వు 25 బేసిస్ పాయింట్లమేర వడ్డీ కోత విధించిన సంగతి తెలిసిందే. ఏడాది తర్వాత ఈ రేట్లను తగ్గించడం ఇదే తొలిసారి. ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పటికీ మందగిస్తున్న కార్మిక మార్కెట్‌కు ఊతమివ్వడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాదిలో మరో రెండుసార్లు వడ్డీరేట్ల కోత ఉండవచ్చని ఫెడ్ అధికారులు సూచనప్రాయంగా తెలిపారు.

## 'బోయింగ్'పై అమెరికాలో దావా

**- ఎయిరిండియా విమాన ప్రమాద కేసు**

**- ఇంధన స్విచ్‌ల లోపమే ప్రమాదానికి కారణమని అభియోగం**



అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో మృతులకు సంబంధించిన నాలుగు కుటుంబాలు విమాన తయారీ సంస్థ బోయింగ్‌పై అమెరికాలో దావా వేశాయి. ఈ పిటిషన్‌లో విడిభాగాల తయారీ సంస్థ హనీవెల్ పేరునూ చేర్చాయి. ఈమేరకు ఆ కుటుంబాలు మంగళవారం దాఖలు చేసిన దావాలో.. ఇంధన స్విచ్‌లు లోపభూయిష్టంగా ఉండటంవల్లే ప్రమాదం సంభవించిందని ఆరోపించాయి. 787 డ్రీమ్‌లైనర్ విమానం డిజైన్, దాని విడిభాగాల అభివృద్ధి సమయంలోనే లోపాలు వారికి తెలుసని.. అయినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని పేర్కొన్నారు. 'ఇంధన సరఫరా, విమాన థ్రస్ట్ నియంత్రణకు సంబంధించిన డిజైన్‌లో లోపం ఉంది' అని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. అంతేకాక.. అకస్మాత్తుగా వచ్చిపడే ప్రమాదాలను నిలువరించేందుకు ఆ రెండు సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నాయి. స్విచ్‌లకు తనిఖీలు, మరమ్మతులు అవసరమని విమానయాన సంస్థలను హెచ్చరించలేదన్నారు. వాటిని రీప్లేస్ చేసేందుకు అవసరమయ్యే విడిభాగాలను పంపించడంలో కూడా ఈ రెండు కంపెనీలు విఫలమైనట్టు తెలిపాయి. ఈ పిటిషన్‌పై బోయింగ్, హనీవెల్ సంస్థలు ఇప్పటి వరకు స్పందించలేదు. అహ్మదాబాద్‌నుంచి జూన్ 12న లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకేఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. అయితే, బోయింగ్ విమానాల్లో ఇంధన నియంత్రణ స్విచ్‌లు సక్రమంగానే ఉన్నాయని యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) చెబుతోంది.

## అట్లాంటిక్ అడుగున జలసిరి!

**ప్రపంచలోనే అతిపెద్ద నీటి నిల్వగా అంచనా - గత మూడు నెలల్లో కొలిక్కి వచ్చిన అన్వేషణ**



సముద్ర గర్భంలో చమురు నిల్వల కోసం వెతుకులాట పరిపాటి. కానీ, అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు అట్లాంటిక్ సముద్ర గర్భంలోని మంచి నీటి సరస్సు కోసం అన్వేషణ మొదలుపెట్టారు. ఈ అన్వేషణ ఫలిస్తే ప్రపంచం ఎదుర్కొంటున్న దాహార్తికి సమాధానం దొరుకుతుందన్న నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఆ సరస్సులో అంత భారీస్థాయిలో జల సిరి ఉండొచ్చని అంచనా. అట్లాంటిక్ అడుగు భాగాన మంచి నీరు ఉందని చాలాకాలం కిందటే గుర్తించారు. కానీ దీనిని వెలికి తీయడానికి ప్రయత్నాలు పెద్దగా జరగలేదు. 1960, 70లలో చమురు కోసం సముద్రంలో డ్రిల్లింగ్ జరుగుతున్నప్పుడు మంచి నీటి ఆనవాళ్లు లభించాయి. 2019లో కొలంబియా విశ్వవిద్యాలయం, వుడ్స్ హెూల్ ఓషనోగ్రఫిక్ ఇనిస్టిట్యూట్లకు చెందిన శాస్త్రవేత్తలు కలిసి.. విద్యుదయస్కాంత తరంగాలను ఉపయోగించి సముద్రం అడుగున భారీ నీటి సరస్సు కనుగొన్నారు. మసాచుసెట్స్ నుంచి న్యూజెర్సీ దాకా ఇది విస్తరించి ఉందని వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద నీటి నిల్వగా చెబుతున్నారు. గత మే నెలలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలు ఈ నీటి అన్వేషణకు శ్రీకారం చుట్టారు. ఎక్స్‌పెడిషన్ 501 పేరుతో కనెక్టికట్‌లోని బ్రిడ్జిపోర్టు నుంచి డ్రిల్లింగ్ రిగ్‌లతో కూడిన నౌకలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు బయలుదేరి వెళ్లారు. 3 నెలలపాటు పలు ప్రాంతాల్లో 1,000 నుంచి 1,300 అడుగుల లోతున అన్వేషించారు. నీటి నమూనాలను తీసుకొచ్చారు. వాటిని పరిశీలించగా.. సముద్రపు నీటికంటే ఉప్పు పరిమాణం తక్కువగానే ఉందని, తాగడానికి అనువుగానే ఉన్నాయని తేలింది. ప్రస్తుతం ఆ నీటిలో ఎటువంటి మైక్రోబ్‌లు ఉన్నాయి.. తాగడానికి అది ఎంతవరకు సురక్షితమనే పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఈ నీటిని వెలికితీయడం అధిక ఖర్చుతో కూడుకున్నదిగా చెబుతున్నారు. తప్పనిసరి అవసరాలకే తీయాల్సి ఉంటుందన్నది శాస్త్రవేత్తలు అభిప్రాయం.

# సీనియర్లకు విశ్రాంతి ఇస్తారా?

## - ఆసియా కప్‌లో నేడు ఒమన్‌తో టీమిండియా మ్యాచ్



ఆసియా కప్‌లో భారత్ తన చివరి లీగ్ మ్యాచ్‌ను శుక్రవారం ఒమన్‌తో ఆడేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే పాకిస్థాన్, యూఏఈని చిత్తు చేసిన టీమ్ ఇండియా ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే అగ్రస్థానంతో సూపర్ -4లో అడుగు పెడుతుంది. అయితే, తుది జట్టులో భారీ మార్పులు చోటు చేసుకొనే అవకాశం లేకపోలేదు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడనేది ఇప్పుడందరిలోనూ ఆసక్తికరంగా మారింది. ఇంతకు ముందు ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్‌లో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు పనిభారంతో రెండు టెస్ట్‌లకు విశ్రాంతి ఇచ్చారు. ఐదింట్లో మూడు మ్యాచుల్లోనే ఆడించారు. అప్పుడు తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ప్రధాన బౌలర్‌ను అన్ని మ్యాచులు ఆడించి ఉండాల్సిందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ఆసియా కప్ లో ఒమన్ ఎలానూ పసికూనే. ఈ మ్యాచ్ తర్వాత టీమ్ ఇండియా సూపర్ -4లో మ్యాచులు ఆడాలి. అక్కడంతా కాస్త కఠినమైన ప్రత్యర్థులే ఉంటారు కాబట్టి, సీనియర్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చి.. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇస్తారనేది క్రికెట్ వర్గాల అంచనా. ఇక ఆల్‌రౌండర్ హార్దిక్‌కు సైతం విశ్రాంతి ఇచ్చేసి హర్షిత్ రాణాను ఆడించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. వీరితోపాటు ప్రస్తుతం జట్టులో మరో ఇద్దరు ప్లేయర్లు జితేశ్ శర్మ. రింకు సింగ్ ఇంతవరకు బరిలోకి దిగలేదు. మరి వీరిలో ఎవరికైనా అవకాశం వస్తుందో లేదో చూడాలి.

**సూపర్-4కు సన్నాహకంగా**

దుబాయ్ లో పాకిస్థాన్‌తో మ్యాచ్ అనంతరం జరిగిన పరిణామాలు భారత క్రికెటర్లపై ప్రభావం చూపుతాయని భావిస్తున్నారు. బుధవారం కూడా మరోసారి పాక్ క్రికెటర్లు ఎదురైనా సరే.. భారత క్రికెటర్లు వారితో కనీసం మాట్లాడలేదు. ఈ గొడవలన్నీ పక్కన పెట్టేసి ఒమన్ మ్యాచ్ కోసం మైదానంలోకి దిగాల్సి ఉంది. ఆ దిశగా జట్టును నడిపించాల్సిన బాధ్యత కెప్టెన్ తో పాటు ప్రధాన కోచ్‌పై ఉంది. లీగ్ దశలో చివరి మ్యాచ్ జరిగిన రెండు రోజులకే సూపర్ -4లో తొలి మ్యాచ్‌ను పాకిస్థాన్‌తో భారత్ (సెప్టెంబర్ 21న) ఆడనుంది. ఆ క్రమంలో ఇప్పుడు ఒమన్ మ్యాచ్‌ను సూపర్ -4దశకు సన్నాహకంగా మార్చుకోనుంది.

**బ్యాటింగ్ ఆర్డర్ మారుస్తారా..**

బ్యాటింగ్ విషయానికి వస్తే తొలి రెండు మ్యాచుల్లో ఓపెనర్లుగా శుభమన్ గిల్, అభిషేక్ శర్మ వచ్చారు. సూర్యకుమార్ యాదవ్ వన్‌డౌన్‌లో ఆడాడు. సంజు శాంసన్ మూడో డౌన్‌లో కూడా బ్యాటింగ్‌కు రాలేదు. ఆ స్థానంలో శివమ్ దూబెను మేనేజ్‌మెంట్ పంపింది. ఒమన్‌తో మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్లో మార్పులు చేస్తారేమో చూడాలి. సంజుకు ప్రమోషన్ ఇచ్చి ఓపెనర్‌గా ఆడించాలని అభిమానుల కోరిక. ఇక ముందు కీలక మ్యాచులు ఉన్న నేపథ్యంలో బ్యాటింగ్ ప్రాక్టీస్ అవసరమనేది వారి భావన.

### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్...

# నిరాశ పర్చిన నీరజ్

**- జావెలిన్‌లో ఎనిమిదో స్థానం**

**- తృటిలో కాంస్యం చేజార్చుకున్న సచిన్ యాదవ్**



సచిన్ యాదవ్



నీరజ్ చోప్రా

భారత జావెలిన్ సూపర్‌స్టార్ నీరజ్ చోప్రా ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాడు. జపాన్ రాజధాని టోక్యోలో గురువారం జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో 12మంది పోటీపడగా నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్కు అందుకోలేకపోయాడు. ఉత్తమంగా 84.03 మీటర్లు విసిరి ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు. మూడు, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 84.03 మీటర్లు విసిరాడు. అయితే, ఈ ఫైనల్లో పోటీపడిన మరో భారత అథ్లెట్ సచిన్ యాదవ్ అంచనాలకు మించి రాణించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అతను ఉత్తమంగా 86.27 మీటర్ల తో విసిరి మొత్తంమీద నాలుగో స్థానంలో నిలిచాడు. సచిన్ 40 సెంటీ మీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. 86.67 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన అమెరికా అథ్లెట్ థాంప్సన్ కాంస్య పతకం అందుకున్నాడు. కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టుబాగో, 88.16 మీ) స్వర్ణం గెలవగా.. అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా, 87.38 మీ) రజతం సాధించాడు.

నీరజ్ తొలి ప్రయత్నంలో 83.65 మీటర్ల దూరం విసరగా.. సచిన్ యాదవ్ ఏకంగా 86.27 మీటర్ల దూరం విసిరాడు. రెండో ప్రయత్నంలో నీరజ్ (83.65 మీ), సచిన్ ఫౌల్ చేశాడు. మూడో ప్రయత్నంలో నీరజ్ ఫౌల్ చేయగా.. సచిన్ (85.71 మీ) విసిరాడు. నాలుగో ప్రయత్నంలో సచిన్ (84.90 మీ), నీరజ్ (82.86 మీ) తో విసిరారు. ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేయడంతో నీరజ్ ఎనిమిదో స్థానానికి పరిమితమై పతక రేసు నుంచి వైదొలిగాడు. సచిన్ యాదవ్ ఐదో ప్రయత్నంలో (85.96 మీ) విసిరి పతకం ఆశలు కలిగించినా.. చివరి ప్రయత్నంలో 80.95 మీటర్ల దూరమే త్రో విసిరాడు. పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ కూడా ఈ ఫైనల్లో తేలిపోయాడు. రెండు, నాలుగు ప్రయత్నాల్లో ఫౌల్ చేసిన అతను.. ఉత్తమంగా 82.75 మీటర్ల త్రోతో పదో స్థానంలో నిలిచాడు.

### దీటుగా బదులిస్తున్న ఇండియా-ఏ

# సెంచరీతో చెలరేగిన ధ్రువ్ జురెల్

**- పడిక్కల్, సాయి సుదర్శన్, జగదీశన్ అర్ధసెంచరీలు**

**- ఆస్ట్రేలియా-ఏ తో తొలి అనధికార టెస్ట్**

**- ఆసీస్-ఏ తొలి ఇన్నింగ్స్ 532/6 డిక్లేర్డ్, భారత్-ఏ ప్రస్తుతం 403/4**

లక్నోలోని ఏక్నా స్టేడియంలో ఆస్ట్రేలియా-ఏతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు చేసిన భారీ స్కోరుకు భారత-ఏ జట్టు కూడా దీటుగా ప్రతిస్పందిస్తోంది. మూడోరోజు గురువారం ఆట ముగిసేసరికి భారత ఏ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 403 పరుగులు చేసింది. దీంతో ఆస్ట్రేలియా ఏ తొలి ఇన్నింగ్స్ స్కోరు (532) ఇంకా 129 పరుగులు వెనుకబడి ఉంది. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ 113, దేవదత్ పడిక్కల్ 86 క్రీజులో ఉన్నారు. 115 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో జురెల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో జురెల్‌కు జోడీగా ఉన్న దేవత్ పడిక్కల్ కూడా సెంచరీకి చేరువయ్యాడు. పడిక్కల్ 178 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 86 పరుగులు చేశాడు. అంతకుముందు సాయి సుదర్శన్ (73), ఎన్ జగదీశన్ (64) అర్ధ సెంచరీలతో రాణించగా.. అభిమన్యు ఈశ్వరన్ (44) పర్వాలేదనిపించాడు. భారత-ఏ ఇన్నింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8) ఒక్కడే విఫలమయ్యాడు.

ఆస్ట్రేలియా ఏ బౌలర్లలో క్జేవియర్ బార్లెట్, కోరే రోచిసిలీ, లియాం స్కాట్, కూపర్ కానోలీ తో వికెట్ తీశారు.

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా-ఏ 532 పరుగుల వద్ద ఇన్నింగ్సును డిక్లేర్ చేసింది. సామ్ కొన్‌స్టాస్ (109), వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ (123 నాటౌట్) సెంచరీలతో కదంతొక్కగా.. క్యాంప్బెల్ కెల్లావే (88), కూపర్ కన్నోల్లీ (70), లియమ్ స్కాట్ (81) సెంచరీలకు చేరువై ఔటయ్యారు.



కాగా, రెండు నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు, మూడు అనధికారిక వన్డేల కోసం ఆస్ట్రేలియా-ఏ జట్టు భారత్‌లో పర్యటిస్తోంది.

**శ్రేయస్‌కు నిరాశ**

టెస్ట్ జట్టులో పునరాగమనంపై ఎన్నో ఆశలతో స్వదేశంలో ఆస్ట్రేలియా - ఏతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బరిలోకి దిగిన టీమిండియా స్టార్ మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. 13 బంతుల్లో బౌండరీ సాయంతో 8 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. గత కొంతకాలంగా టెస్ట్ జట్టులో చోటు ఆశిస్తున్న శ్రేయస్ ఈ సిరీస్‌లో సత్తా చాటి, త్వరలో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగబోయే టెస్ట్ సిరీస్‌కు ఎంపిక కావాలని ఆశలు పెట్టుకున్నాడు. అయితే అతడి అంచనాలన్నీ తారుమారయ్యేలా ఉన్నాయి. భారత జట్టులో మిడిలార్డర్ బెర్త్ కోసం శ్రేయస్‌తో పోటీపడుతున్న మిగతా ఆటగాళ్లుసర్ఫరాజ్ ఖాన్, సాయి సుదర్శన్ దేశవాళీ పోటీల్లో సత్తా చాటుతుండగా.. శ్రేయస్ మాత్రమే వరుసగా విఫలమవుతున్నాడు. ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలోనూ (25, 12) నిరాశపరిచాడు.

# అడ్డంగా దొరికిన పాక్

**క్షమాపణ వీడియోతో నవ్వులపాలు**



ఒక పొరపాటును కప్పిపుచ్చడానికి మరొకటి చేయడం పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు అలవాటుగా మారింది. ఆసియా కప్‌లో ఆ టీమ్ మేనేజ్‌మెంట్ చేస్తున్న విన్యాసాలు విమర్శలపాలు కావడమే కాకుండా.. నెట్టింట ట్రోలింగుకు గురవుతున్నాయి. యూఏఈతో మ్యాచ్‌కు ముందు 'బాయ్ కాట్ చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన పాక్ చివరికి తలొగ్గింది. రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ క్షమాపణలు చెప్పడంతోనే ఇలా చేసినట్లు ప్రకటించింది. ఆ వాదనకు బలం చేకూర్చుకునేందుకు తన అనుకూల సోషల్ మీడియాలో ఆండీ క్షమాపణలు చెప్పినట్లుగా ఒక వీడియోను లీక్ చేయించింది. ఈ వీడియోను షేర్ చేసిన పాక్.. తన తప్పునే తానే బయటపెట్టుకుంది. దీంతో తమ జట్టులో ఎప్పటికీ మార్పు రాదంటూ పాక్ అభిమానులు కూడా నిరాశతో నిర్వేదంలో కూరుకుపోయారు.

ఆసియా కప్ టోర్నీలో భాగంగా ఇటీవల పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో పాక్ ప్లేయర్లతో టీమిండియా క్రికెటర్లు కనీసం కరచాలనం కూడా చేయలేదు. ఇది అవమానంగా భావించిన పాక్.. ఆసియా కప్ టోర్నీ నుంచి వైదొలగుతానని ప్రగల్భాలు పలికింది. పైక్రాఫ్ట్‌ను రెఫరీగా తప్పించాల్సిందేనని స్పష్టం చేసింది. కానీ ఐసీసీ మాత్రం ఇందుకు ససేమీరా అనడంతో పాక్ వెనకడుగు వేయకతప్పలేదు. పైక్రాఫ్ట్ క్షమాపణ చెప్పినందునే తాము మ్యాచ్ ఆడామని పాక్ మేనేజ్‌మెంట్ చెప్పుకుంది. దానికి రుజువుగా వీడియో విడుదల చేసింది. ఆ వీడియోలో పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా, ప్రధాన కోచ్ హెసెన్‌తో పాటు పీసీబీ మేనేజర్, రెఫరీ పైక్రాఫ్ట్ ఉన్నారు. ఈ సమావేశంలోనే పైక్రాఫ్ట్ తమకు క్షమాపణ చెప్పినట్టు పాక్ వీడియోను షేర్ చేస్తూ ప్రచారం చేసుకుంది. అయితే, పైక్రాఫ్ట్ క్షమాపణలు చెబుతున్నట్టు వీడియో మొత్తంలో ఎక్కడా వినిపించలేదు. కేవలం ఆ రోజు జరిగిన సంఘటనను వివరించినట్లుగా మాత్రమే ఉంది. దీంతో, పాక్‌పై నెట్టింట ట్రోలింగ్ మొదలైంది. స్వయంగా పాక్ జట్టు అభిమానులు కూడా విమర్శలకు దిగారు. ఇలాంటి సిల్లీ పొరపాట్లు చేస్తూ తమ టీమ్ అడ్డంగా బుక్కయిపోతోందని అనేక మంది మండిపడ్డారు. ఇక క్రికెట్ అభిమానుల విమర్శలకైతే అంతేలేకుండా పోయింది. ఇది చాలదన్నట్టు యూఏఈ-పాక్ మ్యాచ్‌లో కూడా పైక్రాఫ్ట్ రెఫరీగా వ్యవహరించటం పాక్ జట్టుకు మరింత అవమానకరంగా మారింది. చివరకు ఈ మొత్తం ఎపిసోడ్‌లో పాక్ మరోసారి విమర్శలను మూటగట్టుకుంది.

చైతన్య రథం


# సినిమా

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 

## కల్కినుంచి దీపిక అవుట్

ప్రభాస్ హీరోగా వచ్చిన భారీ బ్లాక్ బస్టర్ హిట్ "కల్కి 2898 ఎడి". దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రంతో బాలీవుడ్ నటి దీపికా పదుకొనె టాలీవుడ్‌కి పరిచయమైంది. తన రోల్‌తో సినిమాలో ఆమె మెప్పించగా.. సినిమా రిలీజయ్యాక సీక్వెల్‌లో కూడా ఆమె కనిపించనుందని మేకర్స్ తెలిపారు. కాని -తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ స్వయంగా కల్కి పార్ట్ 2లో దీపికా పదుకొనె ఎలాంటి భాగం కాబోదంటూ కన్ఫర్మ్ చేశారు. కల్కి 2898 ఎడి లాంటి చిత్రానికి మరింత కమిట్మెంట్ కావాల్సి ఉంటుందని.. అందుకే తమదారులు ఇపుడు వేరైనట్టుగా తెలిపారు. ఇది ఒకింత షాకింగ్ ట్విస్టనే చెప్పాలి. ఇక పార్ట్-2 పనులు దాదాపుగా పూర్తయ్యాయట. ప్రభాస్ డేట్స్ వస్తే మేకర్స్ వెంటనే షూటింగ్ మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

ప్రస్తుతం బాలీవుడ్‌లో నడుస్తున్న చర్చ ఏంటంటే.. దీపిక తన పారితోషికాన్ని 25 శాతం పెంచారని, తనతోపాటు వచ్చే సిబ్బందికీ ఫైవ్ స్టార్ సదుపాయాలు కల్పించాలని కోరారని టాక్. ఇవేకాదు, షూటింగుకు రోజుకు 7 గంటలు మాత్రమే హాజరవుతానని కండిషన్ పెట్టారట. ఈ వార్తల్లో నిజమెంత ఉందో తెలియదు కానీ, వైజయంతీ మూవీస్ పెట్టిన పోస్టులో ఒకే ఒక పదం మాత్రం హైలైట్ అవుతోంది. అదే నిబద్ధత. ఎందుకంటే పారితోషికం, ఇతర సౌకర్యాలు కల్పించడం, లేదా దీపికతో చర్చలు జరిపి ఆమె సిబ్బందిని పరిమితం చేయటం చిత్ర నిర్మాణ సంస్థకు పెద్ద కష్టం కాకపోవచ్చు. కానీ, ఇలాంటి విజువల్ వండర్స్ తీర్చిదిద్దడానికి నెలల సమయం పడుతుంది. ఈ క్రమంలో సినిమా మేకింగ్‌పై అనేక అంశాలు ప్రభావితం చూపిస్తాయి. ఈ ప్రాజెక్ట్‌లో ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్ సహా పలువురు అగ్రతారలు భాగమయ్యారు. దీపికలాగే ఇతర తారాగాణం వరుసగా సినిమాలు చేస్తూనే ఉన్నారు. వీరి కాంబినేషన్ సీన్స్ తీసేటప్పుడు పరిమితి పనిగంటలు మేకింగ్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది సినిమా చిత్రీకరణ సమయాన్ని పెంచడంతోపాటు, బడ్జెట్ అదుపు తప్పిపోవడానికి కారణమవుతుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని దీపికను తప్పించి ఉంటారని తెలుస్తోంది.



## తాండవం.. దాదాపుగా పూర్తైందట

బాలకృష్ణ హీరోగా దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న"అఖండ 2 తాండవం" దాదాపు పూర్తికావొచ్చింది. రిలీజ్ ఎప్పుడా అని ఫ్యాన్స్ పాపం చాలా కాలంగానే ఎదురు చూస్తున్నారు.అయితే, ఇండస్ట్రీలో వినిపించే లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. ప్రస్తుతం మేకర్స్ పార్టీ సాంగ్‌ని చిత్రీ కరిస్తున్నట్టు చెబుతున్నారు. నేటి నుంచే షూట్ మొదలు కానుండగా.. స్పెషల్ సెట్‌వేసి అందులో సాంగ్‌ని హైదరాబాద్‌లోనే తెరకెక్కిస్తున్నారట. ఇక ఈ పాట కూడా పూర్తయితే.. ఆల్మోస్ట్ షూటింగ్ అంతా అయిపోయినట్టేనని అంటున్నారు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా 14 రీల్స్ నిర్మిస్తోంది.



### మార్కో సీక్వెల్

## 'లార్డ్ మార్కో'




ఈమధ్య కాలంలో ఇండియన్ సినిమా దగ్గర క్రేజీ వైలెంట్ సినిమాగా సెన్సేషన్ సెట్‌చేసిన చిత్రమే "మార్కో". మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ హీరోగా దర్శకుడు హనీఫ్ అదేని తెరకెక్కించిన సినిమాకి తెలుగు, హిందీలలోనూ మంచి వసూళ్లు వచ్చాయి. అయితే వీటితోపాటుగా సినిమాలో విజువల్స్ అందులోని వైలెంట్ కంటెంట్ దెబ్బకి పలు కాంట్రవర్సీలూ ఎదుర్కోక తప్పలేదు. ఇక దీని సీక్వెల్ కూడా ఆగే పరిస్థితికి వచ్చింది. కానీ మార్కోకి ఫైనల్‌గా సీక్వెల్ ఇపుడు ఖరారైనట్టు తెలుస్తోంది. మరి దీనికి మేకర్స్ "లార్డ్ మార్కో" అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారట. అలాగే సినిమాలో ఉన్ని కనిపించకపోవచ్చనే మాట కూడా వినిపిస్తోంది. మరి దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఇదిలావుంటే ఉన్ని ముకుందన్‌తో నిన్ననే ప్రధాని నరేంద్ర మోదీ భారీ బయోపిక్ అనౌన్స్‌ైన సంగతి తెలిసిందే.

### ఓజీలో సత్య దాదాగా

## ప్రకాష్‌రాజ్

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్‌మోహన్ హీరోయిన్‌గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన సినిమా "ఓజి". విడుదలకు కేవలం వారం గడువుంది. దీంతో మేకర్స్ ఒకో పాత్రకి సంబంధించిన పోస్టర్‌ని విడుదల చేస్తూ.. ప్రమోషన్స్‌ని పీక్స్‌కి తీసుకెళ్తున్నారు. నిన్న అర్జున్ దాస్ పోస్టర్‌ని రివీల్ చేస్తే.. లేటెస్ట్‌గా నటుడు ప్రకాష్‌రాజ్ పోస్టర్‌ని రివీల్ చేశారు. సినిమాలో ప్రకాష్ రాజ్ సత్య దాదాగా కనిపిస్తాడంటూ కొత్త లుక్‌తో రివీల్ చేశారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం సమకూరుస్తుంటే.. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణం వహిస్తున్నారు. సెప్టెంబర్ 25న సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.



## బెంగళూరులో హ్యాపీగా...



దర్శకుడిగా, రచయితగా, నటుడిగానూ అనురాగ్ కశ్యప్ మంచి పేరు తెచ్చుకున్నారు. 'మహారాజ'లో విలన్ పాత్రతో తెలుగు ప్రేక్షకులకూ దగ్గరయ్యారాయన. అనురాగ్ తెరకెక్కించిన కొత్త సినిమా 'నిషాంచి'. ఈ క్రైమ్ డ్రామా ఈరోజు విడుదలవుతుంది. ఈ సందర్భంగా ఓ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్యూలో.. కశ్యప్ మాట్లాడారు. 'ఇద్దరు కవల సోదరుల కథతో 'నిషాంచి'ని తెరకెక్కించా. ఒకడు బాగా చదువుకుని జీవితంలో స్థిరపడతాడు. మరొకడు నేరాలు చేస్తుంటాడు. ఈ రెండు పాత్రలనూ కొత్త నటుడు ఐశ్వర్ రాక్రే పోషించారు. సినిమాలో ద్విపాత్రాభినయం చేసే సంగతి ముందుగా రాక్రేకు తెలియదు. కొన్ని రోజుల షూటింగ్ తర్వాత అసలు విషయం చెప్పి, అతడిని సర్‌ప్రైజ్ చేశా. ఓ పాత్ర చిత్రీకరణ పూర్తయిన తర్వాత.. బరువుతగ్గి మరో పాత్ర పోషించాడు. హీరోయిన్‌గా వేదిక పింటో నటించారు. ఆమె మాధురి దీక్షిత్‌లా ఉంటుంది" అన్నారు. స్టార్స్‌తో సినిమాలు తెరకెక్కించడం ఇష్టం ఉండదు. వాళ్లతో సినిమా అనగానే ప్రేక్షకుల్లో అంచనాలుంటాయి. ఒకవేళ ఆ అంచనాలను అందుకోలేకపోతే దర్శకుడికే మాటొస్తుంది. కొత్త నటులతో అలాంటి ఒత్తిడి ఉండదు. అందుకే ప్రయోగాలు చేయొచ్చు అన్నారు. నేను నిర్మొహమాటంగా మాట్లాడుతుంటానని కొంతమంది అనుకుంటారు. కానీ, అందులో నిజం లేదు. సైలెంట్‌గా నా పని నేను చేసుకుంటా. నేనేం చేశానన్నది నా సినిమాలే చెబుతాయి. కొన్నాళ్లుగా బాలీవుడ్ నన్ను ప్రమాదకర వ్యక్తిగా చూడడం మొదలు పెట్టింది. అక్కడ నేనేం మాట్లాడినా దానర్థం మార్చేసేవారు. దాంతో అవకాశాలు తగ్గాయి. ఒంటరినన్న ఫీలింగ్ కలిగింది. ప్రస్తుతం బెంగళూరులో ప్రశాంతంగా ఉంటున్నా. ముంబయిలో మూడేళ్లలో నేను రాయగలిగిన దానికన్నా ఎక్కువ బెంగళూరులో ఎనిమిది నెలల్లోనే పూర్తిచేశా" అన్నారు కశ్యప్.

## కోట్లకు పడగలెత్తిన.. సైయారా..

బాలీవుడ్‌లో లేటెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'సైయారా' బాక్సాఫీస్ వద్ద రూ.550 కోట్లకుపైగా వసూళ్లు సాధించి కమర్షియల్ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. సినిమాకు నేటి యూత్ బాగా కనెక్ట్ కావడంతో రిజల్ట్ వచ్చిందని పలువురు సీనియర్ సినీ క్రిటిక్స్ కామెంట్ చేశారు. అయితే ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై స్ట్రీమింగ్ అవుతున్న సినిమా సత్తా చాటుతోంది. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన రొమాంటిక్ డ్రామా ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఓటీటీలో విడుదలైన మొదటి వారంలోనే 'సైయారా' గ్లోబల్ స్థాయిలో అత్యధికంగా వీక్షించబడిన నాన్-ఇంగ్లీష్ ఫిల్మ్‌గా నిలిచింది. జర్మన్ ఎరోటిక్ థ్రిల్లర్ ఫాల్ ఫర్ మీ, నెట్‌ఫ్లిక్స్ హిందీ ఒరిజినల్ ఇన్‌స్పెక్టర్ జెండె సినిమాలను అధిగమించి, ప్రపంచ వ్యాప్తంగా టాప్ పొజిషన్ లోకి ఎక్కింది. అహాన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో 9.3 మిలియన్ గంటల వ్యూయర్‌షిప్ సాధించడం విశేషమనే చెప్పాలి. మరి ఈ చిత్రం ముందుముందు ఎలాంటివండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## ఏదైనా.. పాఠం నేర్పే అంశమే

ఇంట్లో ఎవరు హిట్ అందుకున్నా.. అది అందరి విజయంగా భావించి ఆనందిస్తానని నటి మంచు లక్ష్మి అన్నారు. తన తండ్రి మోహన్ బాబుతో కలిసి ఆమె నటించిన యాక్షన్ చిత్రం'దక్ష'. సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రచారంలో ఆమె బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్యూలో తమ కుటుంబంలో జరిగిన గొడవలపై మాట్లాడారు. "మిరాయ్'విజయాన్ని నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. కుటుంబంలో ఎవరికి సక్సెస్ వచ్చినా మా అందరిదిగా భావించి ఆనందిస్తా. ఒకరి కష్టం వృథా కావాలని ఎప్పుడూ కోరుకోను. జీవిత పాఠాలు నేర్చుకోవాలి అనుకుంటాను.. కానీ, కష్టానికి ప్రతిఫలం రాకుండా ఉండాలని ఎప్పుడూ కోరుకోను. ఎందుకంటే ఈ రంగంలో ఎన్ని ఇబ్బందులు ఉంటాయో నాకు తెలుసు. ఒక ఆర్టిస్ట్‌గా వాళ్లకు సలహాలు ఇస్తాను. 'మిరాయ్' సక్సెస్‌ను ఎంజాయ్ చేయమని మొన్న కలిసినప్పుడు కూడా మనోజ్‌కు చెప్పాను" అన్నారు. "ఒక కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అందరూ నలిగిపోతారు. అలా జరగదని చెప్పడం అబద్ధం. కానీ, మేము ఉండేది అద్దాల మేడలో. ఏం చెప్పినా తల, తోక కట్ చేసి వాళ్లకు నచ్చినట్టు రాసుకునే రోజులివి. అలాంటప్పుడు సైలెంట్‌గా ఉండడమే ఉత్తమమని అనిపించింది.



అందుకే మౌనంగా ఉన్నా. గతంలో ఏది ఒప్పు, ఏది తప్పు అని ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా ఆలోచించడం లేదు. దీనివల్ల నేను ఆనందంగా ఉంటానా? బాధపడతానా? అని ఆలోచిస్తున్నాను. జీవితంలో ఏదైనా మనకు ఒక పాఠం నేర్పడానికే వస్తుంది. ఏది జరిగినా మౌనంగా ఆలోచిస్తే ప్రశాంతత లభిస్తుంది" అని మంచు లక్ష్మి చెప్పారు.